
అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక


పవిత్ర

# శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 04 జూన్ 2024 పేజీలు:36 వెల:30





# ముఖచిత్రపరిచయం

రామభక్త హనుమాన్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే! ఉభయ తెలుగు రాష్ట్రాలలో చైత్ర పూర్ణిమ నుంచి వైశాఖ కృష్ణ దశమి రోజు వరకు శ్రీఅంజనాసూనుని ఆరాధించడం ఆచారం. ఈ 41 రోజుల చివరి వైశాఖ కృష్ణ దశమి నాడు వాయుపుత్రుడు పుట్టాడని ప్రగాఢ నమ్మకం. "యత్ర యత్ర రఘునాథ కీర్తనం"అంటూ ఎక్కడ రామభజన జరుగుతుందో అక్కడ మహాబలుడు ఉంటాడు. చెడుపై మంచిని సాధించే శక్తే రామేష్ట హనుమ. హనుమజ్జయంతి దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరోజు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. రామనామ మహిమను మనకు అందించి తారకమంత్రం భక్తితో పఠించేలా చేసిన అమితవిక్రముడు మనకు ఆరాధ్యదైవం. ఏడున్నర ఏళ్ళ శని దోషం ఉన్నవారు సైతం ప్రతి శనివారం ఫల్గుణసఖుని ఉపాసన చేస్తే శని ప్రభావం ఉండదన్నది వాస్తవం. సింధూరం అలంకరించి, తమలపాకు మాల స్వామికి సమర్పించడం వెనుక శ్రీరామాయణంలో విశేషఘట్టాలను పౌరాణికులు ఉదహరిస్తారు. పింగాక్షుని అనుగ్రహం కావాలంటే స్వామి ఇష్టమైన తారకమంత్ర పఠనం చేస్తూ ప్రీతిపాత్రమైనవి సమర్పిద్దాం! శ్రీసన్నిధానం పాఠకులకు ఆ లక్ష్మణప్రాణదాత అన్ని వేళలా అండగా ఉండాలని కాంక్షిస్తూ చిన్నారి చిత్రకారుడు క్షితిజ్ శ్రీరామ్ సముద్రాల ఆవిష్కరించిన చిత్రంతో కలిపి ముఖచిత్రంగా అందిస్తున్నాము.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:
prapatti.srisannidhanam9@gmail.com
మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323
(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)




సంప్రదించండి

మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!

-మేనేజింగ్ ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

- ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం
https://srisannidhanam.org
prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 4 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి జూన్ 2024 వెల : 30

## ఇందులో

3. ముఖచిత్రపరిచయం
4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
5. నెలవారి పంచాంగం
6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
8. మారుతిం నమత రాక్ష సాంతకమ్ (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
10. అంతిమ స్మృతి
శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు
11. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
12. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
14. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ
16. సత్సంప్రదాయ సేవలో ఆచార్య ఫౌండేషన్
18. అంతా నృసింహమయమే
శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు
19. సీతమ్మ వైభవము
శ్రీమతి మహాలక్ష్మి రాణి గుండు
21. పుస్తక పరిచయం
22. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
23. భగవంతునిపైన భారము
శ్రీమతి వంగల రాధిక
25. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
27. భారతము పంచమవేదము
శ్రీమాన్ శ్రీ డా.అ.కం.పెరుమాళ్ళాచార్యులు
30. ఆధ్యాత్మిక వార్తలు
31. కరీంనగర్‌లో శ్రీరామాయణ హవనము
32. శ్రీసన్నిధానం సారస్వత ఆరాధన
33. మన దేవాలయాలు
35. బాల విజ్ఞానం
36. శ్రీసన్నిధిపదకేళి

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు ‘శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ’ అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం



# దేశానికి మనం ఏంచేశామన్నదే ప్రశ్న

మన సంస్కృతీ, సంప్రదాయాల ఔన్నత్యాన్ని తెలియచెప్పేందుకు పరిశోధనలు చేయాల్సిన అవసరం అనుక్షణం కనిపిస్తుంది. పురాణ ఇతిహాసాలన్నీ చారిత్రక ఆధారాలని, ఇవి భారతీయ జీవన విధానానికి ప్రతిబింబాలని పదే పదే చెపుతున్నా కుహనా వ్యక్తులు చేస్తున్న కుయుక్తులు, విమర్శలు సహనం నశించిపోయేలా చేస్తున్న సందర్భాలు ఈ మధ్యన కనిపించాయి. సహనానికి ప్రతీక హిందుత్వం. సర్వమానవ సౌభ్రాతృత్వం అంటూ చాటిచెప్పిన వారు పదేపదే వల్లెవేస్తున్న సెక్యులరిజం అనే పదానికి వక్రభాష్యం చెపుతున్నారు. వాస్తవాన్ని అవాస్తవాలు అంటూ పదేపదే వల్లెవేస్తున్నారు. స్వార్థప్రయోజనాలకోసం ఇక్కడ భ్రమరకీటక న్యాయం అన్యాపదేశంగా ఆపాదిస్తున్నారు. అవాస్తవాన్ని వాస్తవంగా పదే పదే చెపుతుంటే అదే నిజమని నమ్మేస్థితిని, పరిస్థితులను కల్పిస్తున్నారు. పురాణాలు అభూతకల్పనలు, పుక్కిటి పురాణాలు అని ఈ భరతభూమి గడ్డపైనే జీవిస్తున్నవారు తప్పుడు మాటలు చెబుతుంటే అవే వాస్తవాలా? త్రేతాయుగం, ద్వాపరయుగం కలియుగాలలో జరిగిన సంఘటనలను సంస్కృతి వైభవానికి సరిపోల్చిన సందర్భాలు ఉన్నాయి. కలియుగంలో జరిగిన సంఘటనలు సరిపోల్చుతూ విదేశీ పరిశోధకులు ప్రచురించిన పుస్తకాలు వాస్తవికతకు దర్పణాలుగా కనిపిస్తున్నాయి. ఫిలిప్ లుట్‌గెన్‌డార్ఫ్ అనే అమెరికన్ రచయిత రాసిన పరిశోధనా పుస్తకం “ది మెసేజెస్ ఆఫ్ ఎ డివైజ్ మంకీ” న్యూయార్క్ ఆక్స్‌ఫర్డ్ యునివర్శిటీ ప్రెస్ 2007 సం॥లో 434 పేజీల పుస్తకాన్ని ప్రచురించింది. అంతే కాకుండా శ్రీరామాయణం లోని ముఖ్యఘట్టాలకు ప్రాధాన్యత ఇస్తూ ఫిలిప్ లుట్‌గెన్‌డార్ఫ్ పలు రచనలు చేశారు. ఎన్నో పురస్కారాలు లభించిన ఈ రచయితకు ఇటీవల వాల్మీకి పురస్కారం కూడా వరించింది. తమ పరిశోధనా రచనలో తులసీదాస్ రామచరితమానస్ రచించిన సందర్భాన్ని చక్కగా ఉదహరించారు. అక్బర్ తులసీదాస్‌ను ఫతేపూర్ సిక్రీలో బంధించిన తీరు, వారు 40 రోజులు చెరలో గడిపిన క్షణాలు, రచించిన రచనలు ప్రస్తావించారు. ఆసందర్భంలో వేలాది కోతుల గుంపులు దాడిచేసిన విధం, దీనికి ఉక్కిరిబిక్కిరైన అక్బర్ క్షమాపణచెప్పి తులసీదాస్‌ను సాదరంగా సన్మానించి పంపిన విధం ఉటంకించారు. అదే సందర్భంలో తన రాజ్యంలో రామాలయాలు, హనుమాన్ ఆలయాలకు ఇబ్బందులు కలిగించవద్దని మహజరు జారిచేసిన ఉదంతాన్ని రచనలో ఆధారాలతో ప్రస్తావించారు. ఆతరువాత అక్బర్ తన మకాం ఢిల్లీకి మారిన విధంకూడా వెల్లడించారు. ఫిలిప్ లుట్‌గెన్‌డార్ఫ్ న్యూయార్క్‌లోని ఆక్స్‌ఫర్డ్ యునివర్శిటీ ప్రెస్ ప్రచురించిన పుస్తకాలు నేడు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్నాయి. అతడు 1987లో చికాగో యునివర్శిటీలో బి.ఎ డిగ్రీ చేసి దక్షిణ ఆసియా భాషలు, సంస్కృతిపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆసందర్భంలోనే తులసీదాస్ రామచరితమానస్‌పై ఆయన పరిశోధనా గ్రంథాన్ని అందించారు. వాస్తవాన్ని వాస్తవం అంటూ విదేశీయులు పరిశోధనలు చేస్తున్నవేళ భారతదేశంలో వాస్తవానికి దర్పణం పట్టేవిధంగా సంస్కృతి, ధర్మం జీవించేలా యువత పరిశోధనలు చేయాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇలాంటి రచనలు, పరిశోధనలను దేశంలోని విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉంది. నేటి ఎలక్ట్రానిక్ యుగంలో డిజిటల్ రాతలన్నీ నీటి మీదరాతలౌవుతున్న వేళ గ్రంథరచనలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం వుంది. యువతను ఇలా సరైన మార్గంలో నడిపించేలా తగు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పురాణాలు, ఇతిహాసాలు, వేదాలలో దాగిన రహస్యాలను రేపటి తరానికి అందించే ప్రయత్నం చేయాలి. ఇలా విదేశీయులు ఎందరో భారతదేశ ఔన్నత్యాన్ని తెలియజెప్పుతూ చేసిన రచనలను వెలుగులోకి తేవాలి. మంచిని మంచి అని ఎలా చెపుతున్నామో నిజాన్ని నిర్భయంగా అంగీకరించేలా చేయాలి. ఇది ఏ ఒక్కరో చేస్తే సరిపోదు. ఇది ఒక ఉద్యమంలా, ప్రభంజనంగా చైతన్య శంఖం పూరించాలి. మన ఇంటి సమస్యను పరిష్కరించేందుకు పక్క ఇంటిలో శివాజీ పుట్టనక్కరలేదు. మనమే ధైర్య సాహసాలు ప్రదర్శించాల్సిన తరుణం ఆసన్నమైందని గుర్తిస్తేచాలు. దేశం మనకు ఏంచేసిందని కాదు, మనం దేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఏంచేస్తున్నామని ప్రశ్నించుకుంటే ఫలితం మన ఎదుట సాక్షాత్కరిస్తుందన్నది వాస్తవం.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

జ్యేష్ఠ మాసం 07-06-24 శుక్లపక్షంతో ప్రారంభమై 05-07-24 వరకు, తదుపరి 06-07-24 నుండి ఆషాఢ మాసం

07-06-24 వరకు రోహిణి కార్తి, 08-06-2024 నుండి 21-06-24 వరకు మృగశిర కార్తి, 22-06-24 నుండి ఆర్ద్ర కార్తి.
**పండుగలు** : 01-06-24 హనుమజ్జయంతి 02-06-24 సర్వేషాం ఏకాదశి, 05-06-2024 గురుమౌఢ్యనివృత్తి, 06-06-2024 అమావాస్య, తిరుక్కోటియూర్నంభి తిరునక్షత్రము, 08-06-24 మృగశిర కార్తి, 17-06-24 సర్వేషాం ఏకాదశి, 18-06-2024 కూర్మజయంతి, 22-06-2024 పౌర్ణమి, 25-06-2024 సంకష్టహరచతుర్థి.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల అనుకూలము. విద్యార్థులకు సంతోషము. కుటుంబ సంతోషము, వ్యవహార జయం. తీర్థయాత్రాఫలప్రాప్తి. ఆదాయనంకు లోటుండదు.

**వృషభం:** అన్నిరంగాల వారికి బాగుండును. ఆదాయం బాగుండును. కుటుంబ సౌఖ్యం, సంతాన సౌఖ్యం. సంఘంలో ఉన్నత స్థితి కల్గును

**మిథునం:** ఈ నెల స్థిమితం ఉండదు. ఆరోగ్యం జాగ్రత్త అవసరం, శుభకార్య మూలకంగా ధనవ్యయం, ఋణాలుచేయవలసి వచ్చును.

**కర్కాటకం:** ఈ నెలలో మిశ్రమఫలితాలు, ప్రథమార్ధం బాగుండును. ద్వితీయార్ధంలో కొంత ఇబ్బంది తప్పదు. పనులు కొన్ని నిలచిపోవును. ఆదాయమునకు మించిన ఖర్చులు చేయుదురు. ఊహించని సమస్యలు ఏర్పడును

**సింహం:** తలచిన పనులు సకాలంలో పూర్తి. కుటుంబంలో సఖ్యత, నూతనవస్తు, వస్త్రప్రాప్తి, వివాహాది శుభకార్యాలు, గౌరవలాభం, మీ మాటకు విలువ పెరుగును. సంతానం ద్వారా ఆనందం.

**కన్య:** ఈ నెల కొంత బాగుండును. ఆరోగ్యం బాగుండును. బంధు మిత్రుల సహాయం, గౌరవలాభం. గత సమస్యల నుండి బయటపడుదురు.

**తుల:** ఈ నెలలో స్వల్పంగా ఇబ్బందులు కలిగిననూ ద్వితీయార్ధంలో బాగుంటుంది. అన్నివిధాలా అనుకూలం. కుటుంబ సౌఖ్యం,

**వృశ్చికం:** ఈ నెలలో ఇబ్బందులు తప్పవు. ఆరోగ్యం బాగుండును. కుటుంబ వ్యక్తులతో మాటామాటా పట్టింపులు, శ్రమకు తగిన గుర్తింపు ఉండదు.

**ధనుస్సు:** అన్నివిధాలుగా బాగుండును. ఆదాయం నకు మించిన ఖర్చులు, ఋణాలు చేయవలసి వచ్చును. ఎలక్ట్రానిక్ వస్తువులు (సెల్ఫోన్) పోగొట్టుకొంటారు. సోదరులతో చిన్న చిన్న తగాదాలు.

**మకరం:** ఈ నెల మిశ్రమ ఫలితాలు. ఉద్యోగస్థులకు స్థానచలనములు. గృహమార్పులు. నమ్మినవారి వల్ల మోసపోవుట. చేయువృత్తి వ్యాపారాలందు అనుకూలత. కుటుంబ సౌఖ్యం.

**కుంభం:** అన్నిరంగాల వారికి అనుకూలమే. సమస్యలు పరిష్కారమగును. ఆర్థికంగా బాగుండును. విద్యార్థులకు ఫలితాలు సంతృప్తి నిచ్చును. కుటుంబ సంతోషం,

**మీనం:** అన్నిరంగాలందు అభివృద్ధి, వ్యవహార లాభములు, కుటుంబ సమస్యలు, నిందలు తప్పవు. విద్యార్థులకు బాగుండును.

### ఇంగువ బెల్లం

వర్షా కాలానికి నాంది పలికే మృగశిర కార్తె, వ్యవసాయ పనులకు శ్రీకారం. ఈ కార్తె లో వర్షాలు మొదలవుతాయి. ఈ కాలంలో చాలా మందికి జీర్ణశక్తితో పాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. మృగశిర కార్తి నాడు ఇంగువ, బెల్లం మిశ్రమాన్ని భగవంతునికి నివేదన చేసి ప్రసాదంగా స్వీకరించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ మిశ్రమం రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

### మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు లేవు. కూపాలకు ముహూర్తాలు కలవు.

# శ్రీరామానుజ సుధామాధురి

## అద్భుతం అపూర్వం సౌశీల్య తేజము



**- శ్రీమతి సముద్రాల శారద**

మునుపెన్నడు జరగని మహత్తర ఘటన ఒక అద్భుతం! ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని కలిగించే ఘటన అద్భుతం! అనగా అపూర్వమైన దేదో దానినే అద్భుతం అంటారు. ఊహ కందని ఊహించని అనిర్వచనీయమైన ఈ అద్భుతాలు మన అనుభవాలైన తర్వాత గొప్ప అనుభూతులను మిగులుస్తాయి. తర్వాత అవి చరిత్రలో నిలిచి లోకసామాన్యాలుగా మారిపోతాయి. అవి మహనీయుల చరిత్రలోని విషయాలైనా, చరిత్రలోని సంఘటనలైనా ఆ జాతి సంస్కృతిని సుసంపన్నం చేస్తాయి. "న భూతో న భవిష్యతి" అన్న రీతిలో మిగిలిపోతాయి కూడా! 'అద్భుతం' అనే మూడు అక్షరాల పదం మనం అనేక చోట్ల అతిశయంగా చెప్పడానికే వాడతాము. కానీ వ్యాసభగవానుడు జగత్కారణుడైన భగవంతుడు శంఖ చక్ర గదాది దివ్య ఆయుధాలను ధరించి సకల పరివారంతో అవతరించాడు అని చెప్పేటప్పుడు ఉపయోగించారు. వేదములు ఉపనిషత్తులు వర్ణించే రీతిగా దివ్య స్వరూపంతో విరాజిల్లే భగవంతుడు సంకల్ప కారణ జన్ముడై "పరిత్రాణాయ" అని దేవకీ గర్భమందు ఉదయించగానే తండ్రి అయిన వసుదేవుడు చూస్తున్న సందర్భంలో కృష్ణ భగవానుని దర్శింప చేస్తూ వేదవ్యాసుడు "తం అద్భుతం బాలకమంబు జేక్షణం" అని పుండరీకాక్షుడైన శిశువు రూపంలో గల శ్రీకృష్ణుని అద్భుతం అనే పదంతో సూచించి వర్ణిస్తారు. ఆ ఒకే ఒక్క పదంలో వ్యాసభగవానుని హృదయాన్ని ఆవిష్కరిస్తూ పెద్దలు అద్భుతంగా వ్యాఖ్యానిస్తారు.

అదే విధంగా జాతిని ఉద్ధరించుటకు జగదాచార్యులు కాబోయే శ్రీ రామానుజాచార్యులు కూడా ఉయ్యాలలో శిశువుగానే తనవారికి అద్భుత దర్శనాన్ని చేయించారు. వీరు ఆదిశేషులా! విశ్వక్సేనులా! లేక భగవంతుడేనా! అని వారి వర్చస్సును చూసి మహనీయులు ఎందరో తర్కించుకున్నారట. జన్మించక ముందే పాంచరాత్రాగమం లోనూ వారి అవతార సంకల్పం గురించి ఉందని పెద్దలు నిర్ణయించారు. అలాగే పూర్వాచార్యులు శ్రీరామానుజుల వారి రూపురేఖలతో దివ్యమూర్తులను కూడా ముందే ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో అద్భుతమైన విశేషాలకు జగదాచార్యుల చరిత్రలో నిరూపణలు కనిపిస్తాయి.

సమకాలీకులు సమీపకాలీకులు అయినవారు వారి వైభవాన్ని గ్రంథాలుగా రచించారు. అమూల్య విషయాలను వ్యాఖ్యాన గ్రంథాల్లో కూడా ఉదహరించారు. వారి అద్భుత సౌశీల్యం ప్రతిఫలించే కొన్ని వృత్తాంతాలను తెలుసుకుందాము.

ధర్మశాస్త్రాలను అతిక్రమించకుండా సమధర్మాన్ని అనుసరించడం అనేది ఎంతో సున్నితమైన అంశము. వాటినే పెద్దలు ధర్మసూక్ష్మాలు అంటారు. మహనీయులయిన యామునాచార్యులు సిద్ధాంత ప్రవర్తకులై, ప్రచారకులై శ్రీరంగ క్షేత్రమందు నివాసం ఉండే రోజులలో, వారు పూర్వాచార్యుల ఆజ్ఞానుసారం పరంపరగా వచ్చిన భవిష్యదాచార్య మూర్తిని దర్శిస్తూ (చూస్తూ) సిద్ధాంత స్థాపకులైన ఈ ఆచార్యులు ఎప్పుడు తన ముందుకు వస్తారో అని తలుస్తూ ఎదురుచూస్తూ ఉండేవారట! ఆ ప్రయత్నంలోనే వారు తన శిష్యులలోని ఐదుగురు శిష్యులను ఎంచుకొని రాబోయే జగదాచార్యులకు పంచాచార్యులుగా నియమించి ఉంచారు. వారిలో పెరియనంబి గారు (మహాపూర్ణులు) ఒకరు.

ఒకసారి యామునమునులు పొలంలో దృశ్యం చూశారు. అక్కడ పని చేస్తున్న ఒక వ్యక్తి పని ముగించి శరీరం శుభ్రం చేసుకుని భుజించడానికి ఏమీ లేనందున కొంచెం మట్టిని

# శ్రీరామానుజ సుధామాధురి



తిని నీటిని త్రాగి ఆకలి తీర్చుకోవడం గమనించారు. అది చూసి ఆశ్చర్యంగా యామున మునులు ఆ వ్యక్తిని ప్రశ్నించారు. "కడుపు నింపుకోవటానికి తినే ఆహారం కూడా మట్టే కదా ప్రాణం నిలవడానికి ఆ మట్టే తింటున్నానని" ఆయన బదులిచ్చాడట! సర్వజ్ఞులైన యామునులు అతని జ్ఞాన వైరాగ్య దృష్టికి మెచ్చుకొని తన ప్రియ శిష్యులుగా స్వీకరించారు. వారే మార్నేరినంబి. వైరాగ్యంలో నమ్మాళ్వార్లను పోలి ఉన్నారు కనుక వారికి "మారన్" అని ఆ పేరు సార్థకం అయింది. నాటినుండి ఆచార్యుల ప్రవచనాలు వింటూ వారు మరింత జ్ఞానాన్ని సంపాదించారు. నంబి రానిదే ఆచార్యులు ప్రవచనం ప్రారంభించే వారు కాదట ఇది చూచి కొందరు శిష్యులు నొచ్చుకున్నారు కూడా!

యామున మునులకు "రాజవ్రణం" వలన శరీర బాధ చాలా ఉండేది. శ్రీరంగనాధుని కైంకర్యానికి అడ్డుగా ఉన్న ఈ బాధను యోగ శక్తి చేత త్రిదండానికి అప్పగించి ఆరాధనను ముగించే వారట! ఎంతటి వారికైనా కర్మ శేషము అనుభవింపక తప్పదు అని శాస్త్రవచనం. కానీ వారు గొప్ప భక్తులు, యోగులు, సాధనా తత్పరులు కనుక లౌకిక శారీరిక బాధలను తొలగించుకోకున్నను అనుభవాన్ని మరొకరికి మార్చగల శక్తి వారికి ఉండేది. అలా అత్యంత గురుభక్తి గల మారినేరినంబి ఆ బాధను తాను స్వీకరించాడు. ఒకసారి శ్రీరంగ దర్శనానికి వచ్చిన భగవద్రామానుజులు పరమ భక్తుడైన నంబి శరీర బాధను చూసి చింతించాడు. వెంటనే అక్కడే నిలిచి భగవంతుణ్ణి ధ్యానించి శ్రీ నమ్మాళ్వారుల తిరువాయిమొళి లోని పాశురాన్ని పఠించి భగవంతుని ప్రార్థించారట! వెంటనే నంబి శరీర బాధ తగ్గింది. కానీ ఆయన కలవరపడి ఆచార్యకైంకర్యానికి ఆటంకం కలిగిందని భావించి "ఎవరు ప్రాప్య విరోధి " అని అంటూ బయటకు వచ్చి రామానుజాచార్యులను ఆక్షేపించారు. వెంటనే వారు భగవత్ ప్రార్థనతో యథాస్థితి కలిగించారట! ఇది ఒక అద్భుత ఘట్టం! జ్ఞాన వైరాగ్య సంపన్నులై తరించిన మారినేని నంబి పరమపదించారు. పవిత్రమైన వారి దేహాన్ని ఎవరికి అప్పగించలేక పెరియనంబిగారు (రామానుజాచార్యుల గురువుగారు) తానే శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు కావించారు. అన్య వర్ణుడైన (చతుర్థ) నంబికి ఆచార్యులు దహన సంస్కారాలు చేయడం శాస్త్ర విరుద్ధమని ఎందరో విమర్శించారు తన ఆచార్యులే ఇలా చేయడం చూసి భగవద్రామానుజాచార్యులు ఆ ధర్మసూక్ష్మాన్ని తెలుసు కున్నారట

"మయి కుర్వతి సంసారా  
ద్వినిర్ముక్తా నిమాన్ జనాన్  
యేన కేనచ మార్గేణ  
వర్ణధర్మ విరోధినా"

అనగా ధర్మ విరోధం కాకుండా ఉండే మార్గంలో సంసారముక్తులై జనులందరినీ తరింప చేయడమే నా కర్తవ్యం మరి ఇది ఎటువంటి ధర్మము అని రామానుజాచార్యులు ప్రశ్నించారట. మార్నేరు నంబి ప్రపన్నుడు ఆచార్య భక్తి కలవాడు సదా తన దేహాన్ని మనస్సును ఎంతో పవిత్రంగా ఉంచుకొని జీవించాడు కనుక నాడు లోక సామాన్య ధర్మం అనుసరించి శ్రీరామచంద్రుడు జటాయువుకు అంతిమ (మిగతా 15 వ పేజీలో)

ప్రత్యేకం

# మారుతిం నమత రాక్ష సాంతకమ్

దాసోహం కోసలేన్ద్రస్య

శ్రీరామభక్తి సామ్రాజ్యమునకు చక్రవర్తి హనుమంతుడు. నిష్కల్మషమైన నిస్వార్థమైన భక్తికి ప్రతీక హనుమ. నూరుయోజనముల సముద్రమును దాటి, సీత జాడను తెలుసుకొని, అశోక వనమును ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన అసురులను సంహరించి,

జయత్యతి బలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః
దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః
నరావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః
అర్దయిత్వా పురీం లంకాం అభివాద్య చ మైథిలీమ్
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్

అంటూ "అతిబలుడైన రామునికి, మహాబలుడైన లక్ష్మణునికి జయ మగును గాక! రామునిచే పాలితుడైన సుగ్రీవునికి జయమగు గాక! అక్లిష్ట కర్ముడైన, కోసల ప్రభువైన శ్రీరామ దాసుడను నేను. వాయు పుత్రుడనైన నేను శత్రుసైన్యమును దునుమాడేవాడను. నన్ను 'హనుమాన్' అంటారు. వేల కొద్దీ రావణులు వచ్చినా నాతో యుద్ధము చేయలేరు, రాళ్ళతో చెట్లతో ఈ లంకను ధ్వంసం చేసి, సీతమ్మకు అభివాదనము చేసి, రాక్షసు లందరినీ మట్టుపెట్టి సమృద్ధార్థుడనై తిరిగి నా స్థానమునకు వెళుతాను" అని రామనామమును లంకా నగరమున చాటిన వాడు హనుమంతుడు.

**"ఎక్కడెక్కడ రఘునాథుని సంకీర్తన జరుగుతుందో అక్కడక్కడ తలవంచి నమస్కరిస్తూ, ఆనందబాష్పాలు రాలుస్తూ రాక్షసాంతకుడైన మారుతి నిలచి ఉంటాడు. ఆయనను సేవించండి"**

**"కేవలం హనుమంతుని స్మరిస్తే చాలు బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వము, ఆరోగ్యము, ఉత్సాహము, వాక్పటిమ ఏర్పడుతాయి".**

పుడుతూనే సూర్యబింబాన్ని ఫలంగా భావించి, సూర్య మండలమునకు ఎగసినవాడు. సూర్య బింబాన్ని మింగబోతూ ఉంటే ఇంద్రుడు తన వజ్రాయుధంతో కొట్టాడు. అందువల్ల ముఖంపై గాయమై 'హనుమ' గా పేరు పొందాడు. అంజనా తనయుడు. "హనురస్యస్యేతి" హనుమాన్, మంచి మాటలు గలవాడు. అనగా మధురంగా మాట్లాడ గలవాడు.

మొదటి పరిచయంలోనే రామచంద్రమూర్తి హనుమంతుని వాక్చాతుర్యాన్ని చూసి మెచ్చుకొన్నాడు.



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

నానృగ్వేద వినీతస్య నా యజుర్వేద ధారిణః
నా సామవేద విదుషః శక్యమేవం ప్రభాషితుమ్
నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధా శ్రుతం
బహు వ్యాహరతానేన న కించిదపశబ్దితమ్

(శ్రీరామాయణమ్)

"లక్ష్మణా! మూడు వేదములను, వ్యాకరణము నంతటినీ ఈ హనుమంతుడు అధ్యయనము చేసియుండవచ్చును. చాలా సేపు మాట్లాడినప్పటికీ ఈయన మాటలలో కొంచెం కూడ అపశబ్దం లేదు" అంటూ లక్ష్మణునితో హనుమ మాటల్లోని గొప్పతనాన్ని రాముడు వర్ణించాడు.

రామ నామ సంకీర్తన ప్రియుడు హనుమ. ఎక్కడ రామనామం కీర్తింప బడుతుందో అక్కడ హనుమ ఆనంద బాష్పాలు రాలుస్తూ ఉంటాడు.

యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిం।
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్ష సాంతకమ్॥

# యజ్ఞవరాహ క్షేత్రంలో ప్రవచనాలు



వరాహ మూల మంత్ర సుదర్శన మహామంత్ర సహిత, శ్రీరామ షడక్షరీ సంపుటిత సుందరకాండ హోమ కార్యక్రమములు మే 24 నుండి 26 వరకు యజ్ఞవరాహ క్షేత్రం, బొమ్మకల్, కరీంనగర్ లో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీమాన్ శ్రీ కె.ఇ. స్థలశాయి, స్థానాచార్యులు, భద్రాచల దేవస్థానం వారిచే ప్రవచనాలు నిర్వహింపబడ్డాయి.



# మారుతిం నమత రాక్ష సాంతకమ్

“ఎక్కడెక్కడ రఘునాథుని సంకీర్తన జరుగుతుందో అక్కడక్కడ తలవంచి నమస్కరిస్తూ, ఆనందబాష్పాలు రాలుస్తు రాక్షసాంతకుడైన మారుతి నిలచి ఉంటాడు. ఆయనను సేవించండి” అంటారు అభియుక్తులు.

“రామాయణ మహామాలా రత్నం వన్దేనిలాత్మజమ్”

అన్నట్లు రామాయణ కావ్యమున అత్యంత ప్రధానమైన వాడు హనుమ. హనుమంతుని స్మరణ మాత్రంతోనే సకల కార్యములూ సిద్ధిస్తాయి.

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా।
అజాడ్యం వాక్పటుత్వం చ హనూమత్స్మరణా ద్భవేత్॥

“కేవలం హనుమంతుని స్మరిస్తే చాలు బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వము, ఆరోగ్యము, ఉత్సాహము, వాక్పటిమ ఏర్పడుతాయి”.

అట్టి హనుమంతుడు వైశాఖ బహుళ దశమి, పూర్వాభాద్ర నక్షత్రం శనివారం నాడు అవతరించాడని పురాణ కథనం.

వైశాఖేమాసి కృష్ణాయాం దశమ్యాం స్థిరవాసరే।
పూర్వాభాద్ర ప్రసూతాయ ఆంజనేయాయ తే నమః

అని స్తుతిస్తారు. ఈ హనుమంతుని జయన్తి జూన్ ఒకటవ తేదీన జరుగుతున్నది. శ్రీరామదాసుడైన హనుమను పూజించి సకల శుభాలను పొందుదాము.

శ్రీరామాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః


# శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం, కోమాళ్ళ గ్రామం లో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవ, బ్రహ్మోత్సవాలు మే నెల 25 వ తేదీ నుండి 31 తేది వరకు అత్యంత వైభవోపేతంగా జరిగాయి.



# అంతిమ స్మృతి

శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు, వరంగల్



భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ

అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరం।
యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥

మరణ కాలము ఆసన్నమైనప్పుడు నన్నే స్మరిస్తూ ప్రాణమును దేహమును వదులునో అతడు నన్నే (సాలోక్య సారూప్య సామీప్య సాయుజ్య రూపమైన మోక్షాన్నే) పొందుతాడు. ఈ విషయంలో ఎటువంటి సందేహం అవసరం లేదు అని పేర్కొన్నాడు.

కానీ శరణాగతి చేసిన వారికి (ప్రపన్నులకు) అంతిమస్మరణ అనే నియమము వర్తించదని కంచి వరదరాజస్వామి తిరుక్కచ్చినంబి ద్వారా భగవద్రామానుజు లకు తెలిపిన ఆరు సమాధానాలలో (షడ్వార్తలలో) ఒకటి. అందుకే కులశేఖరాళ్వార్లు ముకుంద మాలలో మరణ సమయమాసన్న మైనప్పుడు చేతులు జోడించే ఓపిక ఉండకపోవచ్చును. భగవన్నామాన్ని పలుకుటకు నోరు పెకులకపోవచ్చును. తెరిచే శక్తి లేకపోవచ్చును. దైవము యొక్క లేక గురువు యొక్క చిత్రపటం దగ్గరలోనే ఉన్నను కళ్ళు తెరిచి చూడగలమో లేదో అని భావించారు. ఓ కృష్ణ! నీ పాద పద్మములు అనే పంజరం లోకి నా మనస్సు అనే రాజహంసను ఈరోజే ప్రవేశపెట్టవయ్యా. మరణ సమయములో కఫ వాత పిత్త దోషముల వల్ల గొంతు పెగలక నిన్ను స్మరించలేనేమో!

**మరణ సమయ మాసన్నమైనప్పుడు భగవన్నామాన్ని పలుకుటకు నోరు, చేతులు జోడించే ఓపిక, కళ్ళు తెరిచే శక్తి లేకపోవచ్చును. ఇప్పుడే, వెంటనే శరణాగతి చేద్దాం!**

కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంతః
అద్యేవమే విశతు మానస రాజహంసః
ప్రాణ ప్రయాణ సమయే కఫ వాత పిత్తైః
కంఠావరోధన విధౌ స్మరణం కుత స్తే

అని పేర్కొన్నారు.

ఈ ప్రార్థనను కులశేఖరాళ్వార్లు చేసింది వారి గురించి కాదు మన గురించి అని గుర్తించాలి. ముందుచూపు లేని మనకు కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ వారు చేసిన మహోపదేశమిది.

మరొక విశేషమేమంటే ప్రపన్నులకు అంతిమస్మరణ లేదు కానీ ప్రపన్నుల అంతిమ సమయాన్ని భగవంతుడు గుర్తిస్తాడు.

ప్రపన్నుడి విషయంలో భగవానుడు అంతిమస్మరణ చేస్తాడు. శరీరంలో ఆరోగ్యం ఉన్నప్పుడు మనసు నిలకడలో ఉన్న సమయంలో ఇతడు నన్ను స్మరించినాడు ఇప్పుడు కట్టె కర్పుక పోయినట్లుగా బండ రాయి లాగా చలనం లేకుండా ఉన్నాడు. మరణావస్థను పొందినాడు అని భగవంతుడు గుర్తిస్తాడు. అంతేగాక ప్రాణోత్క్రమణ సమయములో అంతర్యామిగానున్న భగవానుడే జీవునికి నిష్క్రమణ మార్గాన్ని చూపిస్తాడు. తన ఆజ్ఞా పాలకులైన లోకపాలకుల ద్వారా స్వాగత సత్కారాది కార్యాలన్నీటిని జరిపించి సగౌరవంగా తన లోకానికి తన పాద సన్నిధికి రప్పించుకుంటాడు

స్థితే మనసి సుస్వస్థే శరీరే సతియోనరః॥
ధాతుసామ్యే స్థితే స్మర్తా విశ్వరూపం చ మామజం॥

పరమాత్మయే స్వయంగా తన చేతిని ముక్తపురుషునికి అందించి తన పాదం పై ముక్తుని పాదాన్ని పెట్టించి ఒళ్లో చేర్చుకుంటాడు. 'తం పాదేనాధ్యో రోపయతి' అని బ్రహ్మ సూత్రం వివరిస్తుంది. కావున మనం మన చివరి సమయములో భగవంతుణ్ణి స్మరించవచ్చులే! వృద్ధులయ్యాక ఆధ్యాత్మిక సంప్రదాయ మార్గంలో ప్రవేశిద్దాంలే! అనే భావనతో కాక ఆర్తత్రాణ పరాయణుడైన పరమాత్మ విషయంలో ఇప్పుడే, వెంటనే శరణాగతి చేద్దాం! భగవంతుడే మనల్ని స్మరించే అవకాశాన్ని పొందుదాం! సదాచార్యులను ఆశ్రయిద్దాం వారి మార్గదర్శకత్వంలో ప్రపత్తి మార్గంలో పయనిద్దాం ఈ మానవ జన్మను చరితార్థం చేసుకుందాం!

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట

## అర్చిరాది సంగ్రహం


(గత సంచిక తరువాయి)

2.శ్లో॥ ముక్తోర్చిర్దిన పూర్వపక్ష షడుదఙ్మాసాబ్ద వాతాంశుమత్,
గ్లౌర్విద్యుద్వరుణేంద్ర ధాతృ మహితాః సీమాంత సింధ్వాప్లుతః॥
శ్రీవైకుంఠముపేత్య నిత్య మజడం తస్మిన్ పరబ్రహ్మణః।
సాయుజ్యంసమవాప్య నందతి సమం తేనైవ ధన్యఃపుమాన్॥

ప్రతిపదార్థం: ముక్తః = ప్రకృతి నుండి విడివడిన, పుమాన్ = జీవుడు, అర్చిః = వెలుగు, దిన = దినము, పూర్వపక్ష = మొదటిదైన శుక్ల పక్షము, షట్ ఉదక్ మాస = ఆరుమాసముల సముదాయమైన ఉత్తరాయణం, అబ్ద= సంవత్సరము, వాత = వాయువు, అంశుమత్ = కిరణములు గల సూర్యుడు, గ్లౌః = చంద్రుడు, విద్యుత్ = వెలుగు, వరుణ = వరుణుడు, ఇంద్ర = ఇంద్రుడు, ధాతృమహితాః = బ్రహ్మమొదలగు వారిచే సత్కరింప బడిన వాడై, సీమాంత = లీలా విభూతి యొక్క చివరలో నున్న, సింధుః = నదియైన విరజానదిలో, ఆప్లుతః = మునిగి స్నానం చేసి, నదికి ఆవల ఒడ్డున వున్న, నిత్యం = నిత్యమై, అజడం = చైతన్య వంతమైన, శ్రీవైంకుఠం = పరమాత్మ నివసించు లోకమును, ఉపేత్య= పొంది, తస్మిన్ = ఆలోకంలో, పరబ్రహ్మణః = శ్రీమన్నారాయణునే పొంది, తేన+ఏవ = ఆశ్రీహరితో, సమం= సమానముగా, ధన్యః = ధన్యుడై, నందతా = నిరతిశయమైన ఆనందమును శాశ్వతంగా అనుభవించును,

తాత్పర్యము:

ప్రకృతి నుండి వెలువడిన జీవుడు 'పరమాత్మను చేరాలి' అంటే మార్గములు తెలుపుచున్నారీ శ్లోకంలో. పన్నెండు లోకాలను దాటాలి. లోకాలు అంటే అచేతనం కావు. ఆయా పేర్లుగల లోకాలలో వుండే అభిమాన దేవతలు. వారిని 'ఆతివాహికులు' అంటారు. ఈ ఆత్మ రాకను గ్రహించి ఎదుర్కొని గౌరవంగా వారి లోకాలను దాటించి వీడ్కోలు పొందుతారు. 'అర్చి' అనే అభిమాన దేవత లోకం మొదటిది కావున 'అర్చిరాది' అని పేరు. ఈ అర్చిరాది మార్గ వివరణ. శ్రీభాష్యంలో 'అర్చిరాదినా తత్ప్రదాతేః' అని ప్రారంభించబడి వివిధములైన ఉపనిషత్ వాక్యాల నన్నింటిని సమన్వయ పరిచారు శ్రీభాష్యకారులు. దీనిన గురించి సంగ్రహంగా నమ్మాళ్వార్ల తిరువాయ్ మొజి చివరలో వుంది. ఛాందోగ్య ఉపనిషత్తు, బృహదారణ్యక ఉపనిషత్తు మొ॥ వాటిలో వుంది. సంగ్రహంగా భగవద్గీతలో వుంది.



శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు

అన్నింటిలోని విషయాలను సమన్వయ పరచి స్పష్టంగా వరద గురువులు మనపై అత్యంతదయ గలవారై ఈ రెండు శ్లోకాలలో ఇమిడ్చి మహా ఉపకారం చేసినారు. వారి కృషి అనితర సాధ్యము. సరి విషయానికి వద్దాం. పన్నెండు లోకాలను స్పష్టంగా చూద్దాము.

1. అర్చిర్లోకము. 2. దినలోకము. 3 శుక్ల పక్ష లోకము, 4. ఉత్తరాయణ లోకము, 5. సంవత్సర లోకము, 6. వాయు లోకము, 7. సూర్య లోకము, 8. చంద్ర లోకము 9. విద్యుల్లోకము, 10. వరుణ లోకము, 11. ఇంద్ర లోకము, 12. బ్రహ్మలోకము. ఈ లోకాలను దాటును.

ఇక్కడ మరొక విషయం గమనించండి. సంగ్రహం చేయాలని వరద గురువుగారు వ్రాశారు. విపులంగా పిళ్ళైలోకాచార్యులు గారు అర్చిరాది అనే రహస్య గ్రంథంలో నాలుగు ప్రకరణాలుగా విభజించి వ్రాశారు.

దానిలోని విషయాల నన్నింటిని సంస్కృతశ్లోకాలు, వాటికి తెలుగులో తాత్పర్యాలతో అతి సులభంగా గ్రహించి, కాలక్షేప యోగ్యంగా, ఇంకను గరుడ పురాణాది పురాణాలలోని విషయాలను పన్నెండు అధ్యాయాలుగా శ్రీ ఉ.వే శ్రీమాన్ శిరిశినహళ్ కృష్ణమాచార్య శతావధానిగారు 'అర్చిరాది మార్గం' అనే పేరుతో ప్రింట్ చేశారు. ఇంకా అంతిమ దేహానికి చేయు సంస్కారము అంటే శ్రీచూర్ణ పరిపాలనం'. మరణించిన దాదిగా పదమూడు రోజులు చేయవలసిన వైదిక పక్రియనంతా వారు సులభ శైలిలో అందించినారు.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

## వింద్య క్షేత్రములు

గృహ నిర్మాణము చేయుస్థలము పగిలి యున్న మరణమును, శల్యములున్న కష్టములను, పుట్టలున్న ధన నాశము, ఎక్కువ ఎత్తుగా యున్న ధననాశము ఆయుక్షీణము గుంటలు వున్న మరణము, చవుడు భూమి ధననాశము కలిగించును. నదీ ఘాతముగల భూమి మూర్ఖులను, సంతాన హీనులు నైన సంతతి నిచ్చును. పెద్దపెద్ద రాళ్ళు గల స్థలము దరిద్రులగు పుత్రులను యిచ్చును. సర్పాదులచే బొక్కలు కల్గిన స్థలము అనృత వాదులగు పుత్రులను యిచ్చును. రంధ్రములు గల భూమి పశు పుత్రాదులవలన శోకమును, సుఖహీనతయు కలిగించును. వంకరలుగా నున్న స్థలము విద్యావిహీనులైన పుత్రులను యిచ్చును. రోకలి ఆకృతి కలిగిన స్థలము వంశ ఘాతకులగు పుత్ర సంతతిని ఇచ్చును. భయంకరమగు భూమి భయమును, వాయు పీడితమగు భూమి ప్రాణభయము, ఎలుగు గొడ్డులు గల స్థలము పుత్ర హానిని కలిగించును.

వికృత ఆకారము శునక నక్క ఆకారము గల స్థలము ఆనందము లేకుండా అంగ విహీనములైనట్టి సంతతినిచ్చును. కఠినమయిన మనస్సు కల్గి కుత్సితమయిన మాటలను పలుకునట్టి పుత్రుల నిచ్చును. యజ్ఞశాల వున్న భూమి భయమును, పుట్టలున్న భూమి విపత్తులను, శివలింగమున్న స్థలము పుత్ర నాశనమును కలిగించును. నాల్గువైపుల వీధులున్న స్థలము యశోహానియు, దేవ సంబంధమైన స్థలము ఉద్వేగమును, భూతములు నివసించు భూమి ధన నాశమును, రంధ్రములు గోతులు గల స్థలము విపత్తులను తాబేలు ఆకారము గల స్థలము ధన నాశమును కలుగ చేయును.

గృహనిర్మాణము చేయు స్థలము 'ఇంద్రోన్నతం పుత్రనాశం' భూమి యందు తూర్పుభాగము మిఋుగా వున్న యెడల పుత్రనాశమును, 'వహ్న్యోన్నత మధార్థదం' ఆగ్నేయ భాగము మిఋుగా వున్న ధనలాభము.

'యామ్యోన్నతమరోగకృత్' దక్షిణ భాగము ఎత్తుగా యున్న ఆరోగ్యము. 'నిరృత్యుచ్చై శ్రియోలాభం' నైరుతి భాగము ఎత్తుగా యున్న ధనలాభం "పుత్రదం వరుణోన్నతం' పశ్చిమ భాగము ఎత్తుగా యున్న పుత్రలాభము. 'వాయూన్నతం ద్రవ్యలాభం' వాయవ్య భాగము ఎత్తుగా యున్న ద్రవ్య లాభమును. 'సౌమ్యోన్నత మధోగతిం' ఉత్తర భాగము ఎత్తుగా యున్న దారిద్ర్యము.



### శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

'ఈశానోచ్చం మహాక్లేశం' ఈశాన్య భాగము ఎత్తుగా యున్న మహాకష్టములు, మధ్య భాగము పల్లముగా యున్న ధననాశము, ఎత్తుగా వున్న ఐశ్వర్యము కలుగును.

శ్లో పూర్వ ప్లవాధరాశ్రేష్ఠా హ్యాయు శ్రీబలవర్ధినీ।
సర్వ సంపత్కరీ పుంసాం ప్రాసాదానాం విభూతిదా।
రాజపూజ్యా సదానందా ప్రాక్ పవ్లాచేద్భవేన్మహీ॥

గృహ నిర్మాణము చేయు స్థలముయందు తూర్పు భాగము పల్లముగా నుండుట మిక్కిలి శేష్ఠము. తూర్పుభాగము వంపుగా యున్నస్థలము ఆయుర్దాయము, ఐశ్వర్యము బలము, వృద్ధి, రాజ పూజ్యత ఎల్లప్పుడు ఆనందము సర్వ సంపత్తులను కలిగించును. ప్రాసాదములకు ఐశ్వర్యములను యిచ్చును.

శ్లో॥ ఆగ్నేయ ప్లవకా భూమి రగ్ని దాహ భయావహా।
శత్రు సంతాపదా నిత్యం కలిదోషాగ్ని ప్లవః స్మృతః॥।

గృహ నిర్మాణము కావించు స్థలము ఆగ్నేయము పల్లముగా వున్నచో అగ్నిభయము, శత్రు సంతాపమును పాప కృత్యములను చేయించును.

శ్లో॥ నశ్యన్తి పురుషాస్తత్ర దేవతాచ ప్రణశ్యతి।
ధనహాని కరో నిత్యం రోగకృద్దక్షిణ ప్లవః॥

గృహ నిర్మాణము చేయు స్థలము దక్షిణము పల్లముగా యున్న ధనహాని, రోగము కలుగును. దక్షిభాగము పల్లముగా

యున్న స్థలమున గృహనిర్మాణము జరిపిన యజమానికి మృత్యువు కలుగును. యిట్టి గృహము నందు పురుషులు జీవించరు. దేవాలయము నిర్మించినను దేవునకు గూడ అశుభములు సంభవించును.

శ్లో॥ ప్రవర్తయే ద్గృహే పుంసాం రోగాంశ్చ మృత్యుదాయకాన్
ధనహానిం తథానిత్యం కురుతే నైఋతిప్లవా॥

గృహ నిర్మాణము కావించు స్థలము నైఋతి పల్లముగా యున్న యెల్లపుడు ధనహానిని మరియు రోగాదులు విశేషముగా వచ్చును. యజమానికి మృత్యువు కలుగును.

శ్లో॥ పశ్చిమేచ ప్లవ వాభూమి ధన ధాన్య వినాశనీ।
శోక దాహ్యం కులం తత్ర యత్ర భూః పశ్చిమప్లవా॥

గృహ నిర్మాణము చేయు స్థలము పశ్చిమము పల్లముగా యున్న ధనధాన్య నాశము శోకము వంశ నాశము కలుగును.

శ్లో॥ శతృకర్త్రీ విరాగీ చ గోత్ర క్షయకరీ తథా।
గృహేచ కన్యకాం హంత్రీ సదాదుఃఖ భయావహా।
భుక్తం న జీర్యతే తస్య మహ్యాం తత్ర తుయోవసేత్।
ఏతాన్ దోషా నావహతి దోషదా వాయుదిక్ప్లవా॥

గృహము నిర్మించు స్థలము వాయవ్య భాగము పల్లముగ యున్న శతృత్వము. విరాగతము గోత్ర క్షయము స్త్రీలకు నాశము, యెల్లప్పుడు దుఃఖము భయము యివే కాక గృహ యజమానికి అజీర్ణ వ్యాధి కలుగును. దోషప్రదము.

శ్లో॥ పూజ్యౌ లాభకరీ నిత్యం పుత్ర పౌత్ర వివర్ధనీ।
కామదా భోగదా చైవ ధనదాచోత్తరప్లవా॥

గృహ నిర్మాణము చేయు స్థలము ఉత్తర భాగము పల్లముగా యున్న సర్వజనుల పూజ్యత. లాభము పుత్ర పౌత్రాభివృద్ధి. భోగము ధనము కలుగును.

శ్లో॥ వర సౌఖ్యసతీ సత్య సౌభాగ్య వివర్ధినీ।
ధనాద్యైశ్వర్య సంపన్నా ధర్మ మీశానకప్లవా॥

గృహము నిర్మించు స్థలము ఈశాన్యభాగము పల్లముగా వున్న సౌఖ్యము. భార్యాసౌఖ్యము, సత్యము సౌభాగ్యము వృద్ధి ధన ధనధాన్యైశ్వర్యములు ధర్మవృద్ధి కలుగును.

శ్లో॥ మధ్యప్లవా నికృష్టాస్యాత్కనిష్టా మధ్య వర్తకా।
సర్వనాశకరీ పుంసాం సా భూమిస్తు నివాసినా॥

గృహ నిర్మాణము చేయుస్థలము మధ్య భాగము పల్లముగా వున్నచో నింద్యము. సమానముగా వుండుట అధమము. యిందులో నివసించువారలకు సర్వనాశము. మధ్యభాగము ఎత్తుగా నుండుట శ్రేష్ఠము.

శ్లో॥ భువఃప్లవం ప్రవక్ష్యామి నరాణాం చ శుభాశుభం।
పూర్వప్లవా వృద్ధికరీ ఉత్తరాధనదా స్మృతా॥
అర్థ క్షయకరీం వింద్యా త్పశ్చిమప్లవ నాంతతః
దక్షిణప్లవనాపృథ్వీ నరాణాం మృతి దాభరేత్॥

గృహనిర్మాణము చేయు స్థలమునందు తూర్పుభాగము పల్లముగా వున్న వృద్ధియు. ఉత్తరభాగము పల్లముగా వున్న ఐశ్వర్యములు, పశ్చిమ భాగము పల్లముగా వున్న ధనక్షయము, దక్షిణభాగము పల్లముగా వున్న మరణమును కలుగచేయును

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# సూర్యసిద్ధాంతరత్న



భారతీయ సనాతనధర్మమనే వృక్షానికి మూలకాండము వేదమైతే దాని కొమ్మలు పురాణేతిహాసములు మరియు శాస్త్రములు. కాలాన్ని గూర్చి, గ్రహస్థితిగతులను గూర్చి అనంతమైన విజ్ఞానాన్ని అందించేది మరియు వేదపురుషుని యొక్క నేత్రస్థానమై భాసిల్లే జ్యోతిశ్శాస్త్రమునందు విశేషకృషి చేసినవారు, విశేషాధ్యయనమును సల్పినవారు ఉభయ వేదాంతాచార్య పీఠ మరియు ప్రఖ్యాత యాదాద్రి దేవస్థానానికి ఆస్థానజ్యోతిష పండితులు, ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ జీవితకాల సభ్యులు, తెలంగాణరాష్ట్ర జ్యోతిష సలహాదారులు, శ్రీపాంచరాత్రాగమవిద్వాన్, దైవజ్ఞ భూషణులు, దైవజ్ఞశిఖామణి, జ్యోతిష శిరోమణి, జ్యోతిషప్రవర్తక, దైవజ్ఞరత్న ఇత్యాద్యనేక బిరుదాంకితులు శ్రీ ఉ.వే శ్రీమాన్ తి.న.చ సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతిగారిని "సూర్యసిద్ధాంతరత్న" అను బిరుదముతో జగద్గురు శంకరాచార్య జయంతి నాడు సన్మానించారు.

ఈ శుభవేళలో సూర్యసిద్ధాంతరత్న అను బిరుదు ప్రదానము శ్రీఉజ్జయిని మహంకాళీ దేవస్థానములో 12-05-24న సన్మానిస్తున్నప్పటి విశేషాలు. ★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

దత్తాత్రేయుని అవతారాన్ని గురించి మరికొన్ని విశేషాలు తెలుసుకుందాం!

పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుని పత్ని, ఒకనాడు సూర్యోదయం కాగానే తన భర్త మరణిస్తాడని తెలిసి, సూర్యోదయం కాకూడదని శాసించింది. సూర్యోదయం కాకపోవటం చేత లోకాలన్నీ తల్లడిల్లాయి. దేవత లందరూ అత్రిమహర్షి భార్య ఐన అనసూయను శరణు జొచ్చారు. అనసూయాదేవి, కౌశికపత్నిని అనునయించి, సూర్యోదయం చేయించింది. తన పాతివ్రత్య మహిమతో కౌశికుణ్ని పునర్జీవింప జేసింది. అది చూసి ఆనందించిన త్రిమూర్తులు, ఆమెను వరం కోరుకోమన్నారు. ఆమె "మీరు ముగ్గురూ నాకు పరమయోగ్యులైన పుత్రులుగా నా కడుపున జన్మించాలి" అని కోరింది. వారిలో దత్తాత్రేయమహర్షిది శ్రీమహావిష్ణువు అంశావతారం.

బాల్యం నుండీ సంగరాహిత్యంతో ఉండేవాడు దత్తాత్రేయుడు. అతని సత్ప్రవర్తనకు మెచ్చి ఆనందించిన తోడి ముని బాలకులందరూ ఎప్పుడూ అతనితోనే ఉండేవారు. ఏకాంతం కోరుకొనే దత్తాత్రేయుడు, వీరి నుండి తప్పించుకోవాలని ఒకనాడు ఒక కొలనులో మునిగి ఉన్నాడు. ఐనా సరే, ఆ మునిపుత్రులు అతన్ని వదలలేక, కొలను తీరం దగ్గరే తచ్చాడుతున్నారు. ఇక స్వామి సంకల్పమాత్రం చేతనే లక్ష్మీదేవిని రప్పించి, ఆమెతో బాటుగా బయటికి వచ్చాడు. అప్పటికీ ఆ బాలకులు అతన్ని వదలకుండా అతన్ని కీర్తించసాగారు. అప్పుడు దత్తాత్రేయుడు, లక్ష్మిని ఒడిలో కూర్చోబెట్టుకొని, మద్యపానం చేస్తూ ఆటలు, పాటలు సాగించాడు. అంతే కాకుండా ఆమెతో కామాలాపాలు కామసంబంధ సంభాషణ ప్రారంభించాడు. దానితో ఆ మునిబాలకులు అతన్ని అసహ్యించుకొని, వదలి పెట్టి వెళ్లిపోయారు.

ఆనాటి నుండి దత్తాత్రేయుడు ఆంతరంగిక తపోధ్యానాలలో ఉంటూ, పైకి మద్యపాన స్త్రీలోలత్వాలు ఉన్నట్లు నటించ సాగాడు. మహాయోగులు తప్ప మిగిలినవారు ఆతని తత్త్వాన్ని గ్రహించలేక, మూఢులై వెళ్లిపోతూ ఉండేవారు.



శ్రీమతి తిరుమల నీరజ

ఇట్లా ఉండగా జంభాది రాక్షసులు ఇంద్రునిపై దండెత్తి, దేవతలను ఓడించి, వారిని ఎన్నోవిధాలుగా బాధించసాగారు. ఏడాదిపాటు యుద్ధం చేసినా దేవతలు వారిని గెలవలేక పోయారు. అప్పుడు ఇంద్రాదులు, వాలఖిల్య మహర్షులతో కలసి, తమ గురువైన బృహస్పతి వద్దకు వెళ్లి, ఉపాయం చెప్పమని కోరారు.

బృహస్పతి బాగా ఆలోచించి, "దేవతలారా! అత్రిమహర్షి కుమారుడు దత్తాత్రేయుడనే మహాత్ముడున్నాడు. మీరు వెళ్లి అతన్ని భక్తితో సేవించి భజిస్తే, అతడు మీకు ఉపకారం చేయగలడు. నాకు ఇంతకన్నా గత్యంతరం కనబడటం లేదు" అన్నాడు.

అప్పుడు దేవత లంతా తమ గురువు అనుమతితో వేగంగా ఆ దత్తాత్రేయుని ఆశ్రమాన్ని సమీపించారు. అతడక్కడ, కిన్నరగంధర్వులు కీర్తిస్తూ ఉంటే, లక్ష్మీసమన్వితుడై, సముజ్జ్వల తేజస్కుడై విరాజిల్లుతున్నాడు. దేవతలు అతనికి భక్తితో నమస్కరించారు. ఇక దత్తాత్రేయుడు తన ఆట మొదలుపెట్టాడు. వారితో తనకు మద్యం తెమ్మన్నాడు. వారూ అలాగే అతనికి మద్యం అందిస్తే, లక్ష్మీదేవితో కలసి మద్యపానం చేసి, గంతులు వేస్తూ పారిపోసాగాడు. దేవతలు అతని వెంటనే వెళ్లారు. అట్లా వారిని తిప్పలు పెట్టి, వారి ఆరాధనలు స్వీకరిస్తూ చివరికి ఒకనాడు, "మీరు ఏ పని మీద వచ్చారు?" అని అడిగాడు.

అప్పుడు దేవతలు జంభాసురుని వృత్తాంతం చెప్పి, వారందరినీ వధించి దేవహితం చేయమని ప్రార్థించారు. అతడు, "నేను మద్యాసక్తుణ్ని. స్త్రీలోలుణ్ని. కర్మభ్రష్టుణ్ని. ఉన్మత్తుణ్ని. నేనా రాక్షసులను గెలువలేను. ఇక్కడి నుండి వెళ్లిపొండి!" అన్నాడు. అప్పుడు దేవత లందరూ కలసి, "ఓ

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

మహాత్మా! నీవు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువువు. ఆద్యునివి. నీతో ఉన్న ఈమె ఇందిరాదేవి. నీవు సత్యజ్ఞానానందస్వరూపునివి. నీకు విధినిషేధాలు లేవు. నీకన్నా సర్వసమర్థుడు ఇంకొకడు లేడు. మమ్మల్ని రక్షించు!" అని స్తుతించి ప్రార్థించారు. అప్పుడు కరుణించిన దత్తాత్రేయుడు, "నన్ను మీరు తెలుసుకున్నారు. దేవహితం కన్నా నాకు కావలసిందేమీ లేదు. మీరా దైత్యులను యుద్ధం చేయటానికి ఇక్కడికి తీసుకురండి. క్షణంలో వారిని పరిమారుస్తాను!" అని చెప్పి వారిని పంపించాడు. దేవతలు వెంటనే వెళ్లి జంభాదులను యుద్ధం చేయటాని కని దత్తాత్రేయుని ఆశ్రమం వద్దకు రమ్మన్నారు. జంభుడు ససైన్యంగా అక్కడికి వచ్చి, స్వామి పక్కనే ఉన్న లక్ష్మీదేవిని చూసి కామమోహితుడయ్యాడు. నెమ్మదిగా ఆమెను అపహరించి శిబిక పల్లకి ఎక్కించి మోసుకుంటూ పోసాగాడు. దత్తాత్రేయుడు, "లక్ష్మి దానవుల తలపైకి ఎక్కింది. అంటే వారిని ఇక వదలి పెట్టేస్తుందన్నమాట! ఆ సంపదల వల్లనే దైత్యు లందరూ బలహీను లయ్యారు. మీరు యుద్ధం మొదలుపెట్టి వారిని దునుమాడండి, సంహరించండి" అని చెప్పాడు. దేవతలు మునుపటివలె కాకుండా, క్షణంలో రాక్షసు లందరినీ వధించి, దత్తాత్రేయస్వామిని స్తుతించి స్వర్గానికి తిరిగివెళ్లారు.

ఆ కాలంలోనే హైహయ వంశీకుడైన కార్తవీర్యార్జునుడనే రాజు, తండ్రి తరువాత రాజ్యానికి వచ్చాడు. కానీ, రాజ్యపాలన పట్ల అనాసక్తుడై, మంత్రులను పిలిపించి, "మంత్రులారా! ఈ రాజ్యం నాకు వద్దు. పరస్పరద్వేషం, దొంగల బాధల నుండి కాపాడటం కొరకు ప్రజలు ధరణీపతికి (ధరణిని ఏలేవాడు రాజు) ధనం చెల్లిస్తూ ఉంటారు. నేనా పాపకార్యాలు చేయలేను. అరణ్యాలకు వెళ్లి తపస్సు చేసి, అధ్యాత్మయోగసిద్ధి పొంది వస్తాను" అని చెప్పాడు.

వారిలో గర్గుడు అనే మంత్రిపుంగవుడు, "ఓ రాజా! దత్తాత్రేయమహర్షి మహాయోగ సంపన్నుడు. అతని అనుగ్రహం పొందితే నీ అభిమతం నెరవేరుతుంది" అని బోధించి, ఇంద్రుడు జంభాది రాక్షసులను సంహరించిన వృత్తాంత మంతా చెప్పాడు. (సశేషం)

# శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి) సంస్కారం చేశాడు. అలాగే మహాభారతంలో ధర్మ నిరతుడైన ధర్మనందనుడే వర్ణ ధర్మాన్ని అతిక్రమించి ప్రపన్నుడైన విదుర మహాశయునికి అంతిమ సంస్కారం చేశాడు. ఈ దేహము ఆత్మ పరమాత్ముని సొత్తు అని శేషత్వ భావనతో తరించిన నంబి శరీరం పరమ పావనం.

"విశిష్టా దేహ సంపత్తిః ఈశ్వరాయ నివేదితుం" అన్నట్టు ఆళవందారులంతటి గొప్ప ఆచార్యులచే పంచ సంస్కారాలు చేయబడ్డ దేహం కనుక హవిస్సు వలె అగ్నిలో అర్పించితే అది ధర్మమే. అని లోకానికి పెరియ నంబి వారి ఆచరణలోని గొప్పతనాన్ని తెలియపరిచారు.


"సామాన్య ధర్మం లోకేషు ప్రవర్తయతు మాదరాత్" అని ఇంతటి ధర్మాన్ని సమానత్వ భావాన్ని మరొకసారి లోకానికి ఎరిగింపదలచారు జగదాచార్యులు.

ఒకరోజు వీధిలో పోతున్న మూగవానిని లోపలికి పిలిచి ఆచార్య దర్శనం అనగా తన స్వరూపం యొక్క దర్శనాన్ని చేయించి ఉపదేశించి తరింప చేశారు.

స్పృష్ట్వా దేహం మూకాయ
ప్రదర్శ్యో వాచ సంజ్ఞయా
ఇమమేవహి జానీహి
శరణం గురు విగ్రహం

అనగా తన శరీరాన్ని తాకి అతనికి చూపి సంజ్ఞ చేస్తూ ఈ ఆచార్య విగ్రహాన్ని స్వరూపాన్ని శరణమని తలంచుకో అని ఉపదేశించారు. ఇదంతా ఎన్నోనాళ్ళుగా ఆచార్యులను సేవిస్తున్న కూరనాథులు నేను కూడా ఇలా దీనునిగా తక్కువ కులంలో పుడితే బాగుండేది ఆచార్య అనుగ్రహం దొరికేది కదా అని ఆచార్య భక్తితో శ్రీ కూరనాథులు తలచారట!అందుకే

అద్భుతం అపూర్వం జగదాచార్యుల సౌశీల్య తేజము.



శ్రీసంప్రదాయ సేవలో

# శ్రీ ఆచార్య ఫౌండేషన్

**తిరువరంగం దాస శేషాచార్యులు వ్యవస్థాపకులు 78424 24346**









శ్రీ వైష్ణవ సంప్రదాయంలో "ఆచార్య స్తుతే గతిం వక్తా" అని అంటారు. ఎందుకనగా జీవుడు దేవుడు విడివిడిగా ఎడ ముఖం పెడముఖంగా ఉంటే! వాస్తవానికి జీవుడు ఎప్పుడూ తన వైపు మరలతాడో అని, జీవుడు ఎప్పుడూ తనతో ఉండే నవవిధ సంబంధాలను గుర్తిస్తాడా! అని దేవుడు ఎదురు చూస్తుంటాడు. పరమాత్మ ఈ జీవుడు తనకు విజాతీయుడుగా ఉన్నాడు. అని గ్రహించి సజాతీయుడైన ఆచార్యులను అందిస్తే! ఆచార్యుల దగ్గరకు వెళ్లడానికి ఎటువంటి వ్యతిరేకతను ప్రదర్శించడు అనే ఉద్దేశంతో భగవద్రామానుజులనే ఆచార్యులను లోకానికి అందించారు. వారు తాను స్వయంగా సాంప్రదాయ అభివృద్ధికి కృషి చేయడమే కాక భవిష్యద్దర్శనంతో 74 ఆచార్య పీఠాలను స్థాపించి వారి ద్వారా సంసారంలో ఉన్న జీవవర్గాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నం సఫలవంతం చేశారు. అలా సాగుతున్న పరంపరలో ఆచార్యులే సర్వస్వం అని భావించడానికి తగిన రీతిలో అనేక గ్రంథాలు ఈ విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. ఆందుకే ఆచార్యులే ప్రధానము, ఆయనే ఘటకులు అని తెలుసుకోవాలి. ఎలా అంటే దేవుడైన రాముడు జీవుడైన సీతమ్మ దూరం దూరంగా ఉంటే రాముడి క్షేమాన్ని సీతమ్మకు సీతమ్మ క్షేమాన్ని రాముడికి చెప్పి వారిద్దరూ ఒకటి అయ్యేలా చేసిన హనుమంతుడనే ఆచార్యుడు ఒక ఘటక కృత్యాన్ని చేసినాడు. అలాగే జీవుడికి దేవుడికి అనుసంధానం చేసే ఆచార్యులు కూడా ఘటకులే అటువంటి ఆచార్యులే ప్రధానంగా ఉండే సాంప్రదాయం శ్రీవైష్ణవ సాంప్రదాయం.

అందుకే ఆచార్యులనే ముందుగా ఉంచుకొని "శ్రీఆచార్య ఫౌండేషన్" అనే పేరుతో ఆధ్యాత్మిక సాంప్రదాయ సేవలో కైంకర్యం చేయటం కోసం 2019లో ఏర్పడిన సంస్థ శ్రీఆచార్య ఫౌండేషన్.

రామానుజ సాంప్రదాయాన్ని పాటిస్తూ పరిరక్షిస్తూ ప్రచారం చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. అనేక సాంప్రదాయ గ్రంథ బోధనలు చేస్తూ ఆత్మ గుణ సంపద కలిగిన వారు జ్ఞానానుష్ఠానాలు భక్తి వైరాగ్యాలు పరిపూర్ణంగా కలిగి ఉండి వారికి సాటి ఎవరూ లేరు అనే విధంగా వైభవం కలిగిన వారు మహా మహోపాధ్యాయ కవి శాబ్దిక కేసరి శాస్త్ర రత్నాకర శ్రీ ఉ వే ప్ర శ్రీమాన్ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్య స్వామి వారు. వారి పరంపరగా ఏర్పాటైన శ్రీ ఆచార్య ఫౌండేషన్ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

కరోనా సమయంలో జనులు ఎవరు బయటకు వెళ్లే పరిస్థితులు లేక స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నపుడు శ్రీవైష్ణవ స్వరూపం తెలుసుకోవటానికి, ఉల్లాసవంతులు కావటానికి సత్ గ్రంథములననుసరించి పెద్దల శ్రీ సూక్తులను ఆన్లైన్ మాధ్యమం ద్వారా కాలక్షేపం నిర్వహించింది. రఘునాథ వింశతి, తిరుప్పల్లాండు, యతి రాజవింశతి, ముకుంద మాల, తిరుమాలై, పూర్వోత్తర దినచర్య వంటి గొప్ప గ్రంథాల పైన శ్రీమాన్ సముద్రాల శఠగోపాచార్య స్వామి వరంగల్ ద్వారా ఒక సంవత్సరం పాటు ప్రవచనాలను అందించడం జరిగింది. అలాగే శ్రీమాన్ న.చ రఘునాథ ఆచార్య స్వామి వారి తిర్నక్షత్ర మహోత్సవాన్ని

కూడా ఆన్లైన్లో నిర్వహించారు. అలాగే గీతా భాష్యానికి శ్రీమాన్ కండ్లకుంట వెంకటనరసింహాచార్య స్వామి వారిచే నిర్విఘ్నంగా సరళ సుందరంగా మధురంగా కాలక్షేపం పూర్తి కావడం జరిగింది. ప్రస్తుతం మధ్యాహ్నం రెండు గంటలకు వేదార్థ సంగ్రహం నాలుగు గంటలకు యతీంద్రమతదీపిక యూట్యూబ్ మాధ్యమం ద్వారా కండ్లకుంట వెంకటనరసింహచార్య స్వామి వారిచే నిర్వహించబడుతున్నది. ద్రావిడ వేదాంతంలో గొప్ప జ్ఞానం కలిగిన శ్రీమాన్ వంగల వెంకటాచార్య స్వామి నరసాపురం వారిచే భగవద్విషయము కాలక్షేపము, మననము, ప్రబంధ గోష్ఠి నిర్వహణ జరుగుతున్నది. గోష్ఠిలోని వారిని ప్రోత్సహించడం కోసము సభలు నిర్వహిస్తూ పండితుల సమక్షంలో వారు నేర్చుకున్నది విన్నవించుటకు అవకాశం ఇవ్వబడుతున్నది. పెద్దలే కాక పిల్లలకు కూడా వారిని సంప్రదాయం వైపుకు నడిపించాలనే ఉద్దేశ్యంతో తిరుప్పావై పాశురాలను అనుసంధానం చేయడం జరుగుతున్నది. అలాగే పఠన పోటీలు గోదాదేవి వస్త్రాలంకరణ ఇత్యాది అనేక పోటీలను స్వరూప్‌నగర్ ఉప్పల్ లోని కనిగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించి బహుమతులను పంచడం జరుగుతున్నది.

సంప్రదాయ సేవలో భాగంగా దేవాలయాల్లో అనేక ఉత్సవాలకు సేవా సహకారములు అందించుట,అధ్యయన ఉత్సవాలు పరమపద ఉత్సవాలను నిర్వహించుట ఆళ్వార్ల ఆచార్యుల తిరునక్షత్ర మహోత్సవాలను నిర్వహించుట, అన్ని రకాలుగా సంప్రదాయ అభివృద్ధికి కృషి చేయుట, జిజ్ఞాసులైన వారికి ఆన్లైన్ మాధ్యమం ద్వారా స్వరూప జ్ఞానం పెంచుకునే విధంగా కాలక్షేపాలను నిర్వహించటం. ఈ విధంగా తెలంగాణ మరియు ఆంధ్ర ప్రాంతాలలోని ప్రముఖుల మంగళాశాసనాలతో సహాయ సహకారాలతో విశేషమైన ఫలితాలను సాధిస్తున్నది ఆచార్య ఫౌండేషన్.

(అక్షర రూపంలో సంప్రదాయ అర్చన చేస్తున్నటువంటి శ్రీసన్నిధానం పత్రిక ద్వారా మా సంస్థ యొక్క లక్ష్యాలను కార్యక్రమ విశేషాలను అందరితో పంచుకోవటం ఒక అద్భుతమైన అవకాశంగా భగవద్రామానుజ, రఘునాథ దేశికుల అనుగ్రహంగా భావిస్తున్నాము.) ★

# శీతల చందనం సుందర స్వరూపం



మే 10న సింహాచల వరాహ నృసింహ స్వామి చందనోత్సవం. చందన పూతతో అలరారే సుందర దివ్య స్వరూపం సింహాచల నరసింహ స్వామి రూపం. చారిత్రక ప్రాధాన్యాన్ని భగవంతుని మహాత్మ్యాన్ని తెలియచెప్పే ప్రత్యేక ఉత్సవాలు ఒక్కొక్క పుణ్యక్షేత్రంలో ఒక్కోరకంగా వైభవంగా నిర్వహింపబడతాయి. సింహాచలంలో వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయ నాడు జరిగే చందనోత్సవం ప్రసిద్ధము. పవిత్రము కూడా. సంవత్సరానికి ఒకసారి అక్షయ తృతీయ కు ముందురోజు రాత్రి స్వామి దేహంపై కప్పబడి ఉన్న 120 కిలోల చందన లేపనాన్ని తొలగించి భక్తులకు నిజరూప దర్శనం గావిస్తారు. ఒలిచిన చందనాన్ని భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. అక్షయ తృతీయ నాడు సాయంత్రం నిజరూప దర్శనం తర్వాత సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. 300 మందికి పైగా శ్రీ వైష్ణవ స్వాములు పంచసూక్త విష్ణు సహస్రనామ అనుసంధాన పారాయణాలతో పంచామృత సహితంగా స్వామివారిని అభిషేకిస్తారు. శుద్ధోదక స్నానం ముగిసిన తర్వాత చందనాన్ని అద్దే కార్యక్రమం ప్రారంభిస్తారు. స్వయంగా చేతులతో అరగదీసిన గంధమును వడగట్టి అందులో పచ్చ కర్పూరం కుంకుమపువ్వు మురారి పసుపు కస్తూరి వంటి పరిమళ ద్రవ్యాలను కలిపి ముందు 30 కిలోల చందనాన్ని అద్దుతారు. తిరిగి వైశాఖ పూర్ణిమ జ్యేష్ట పూర్ణిమ ఆషాడ పూర్ణిమ లకు 30 కిలోల చందనాన్ని అద్దుతూ నాలుగు విడతలుగా 120 కిలోల చందన లేపనాన్ని స్వామివారి నిజరూపము పైన పూతగా అద్దుతారు. ప్రపంచ ప్రసిద్ధమైన ఈ ఉత్సవాన్ని వేలమంది భక్తులు సేవించు కుంటారు. వరాహముఖం నరుని స్వరూపం సింహం తోక కలిగిన దివ్య సుందర స్వరూపంతో ప్రహ్లాద వరదుడై ఇక్కడ అవతరించాడని స్థల పురాణం. ప్రహ్లాదుని కాలంనాడు అవతరించిన స్వామి తిరిగి పురూరవ చక్రవర్తి కాలంనాటి నుండి మళ్ళీ ఆరాధనలను అందుకుంటున్నాడు. నాటి నుండి చందనోత్సవం జరుపబడుతున్నట్టుగా చరిత్ర చెబుతున్నది. ★

# అంతా నృసింహ మయమే

(క్రిందటి సంచిక తరువాయి)

**పెరియాళ్వార్ ఆనతిచ్చిన తిరుప్పల్లాండులో శ్రీనృసింహ వైభవం:**

"అందియంబోదిల్ అరియురువాకి అరియై అళిత్తవనై, పందనైతీర ప్పల్లాండు పల్లాయిరత్తాండెన్ను పాడుదుమే"

తిరుప్పల్లాండులో ఆరవ పాశురంలో ఉన్నటువంటి పై రెండు పాదముల తాత్పర్యం ఏమిటంటే, దేవతలకు బలం తగ్గి అసురులకు బలం అధికంగా ఉండే సాయం సంధ్యా కాలంలో అవతరించినవాడూ, అన్ని కాలములలోనూ ప్రేమతో మంగళాశాసనం చేయదగిన రీతిలో అందమైన నృసింహ రూపం కలవాడినీ అళగియన్ తానే అరియురువన్ తానే... అనగా అందమైన వాడూ తానే నృసింహుడూ తానే అని అర్థం (నాన్ముకన్ తిరువందాది) శత్రువులను సంహరించిన వానినీ, స్తంభమునుండి జనించుటవలన అపుడే పుట్టిన బిడ్డకు కలిగిన అలసట తీరటానికై, ఏ ఆపదా రాకుండా ఉండుటకు పెరియాళ్వార్లు మంగళాశాసనం చేయటం ద్వారా తిరుప్పాల్లాండులో శ్రీనృసింహ వైభవం గమనించవచ్చు.



**శ్రీఆండాళ్ ఆనతిచ్చిన ప్రబంధము లలో శ్రీనృసింహ వైభవం:**

పెరియాళ్వార్ పెత్తెడుత్త పెన్పిళ్ళైగా ప్రసిద్ధి నొందిన శ్రీఆండాళ్ తన తండ్రి చూపిన మార్గంలో కాక ఇంకో మార్గంలో వెళుతుందా? వెళ్ళనే వెళ్ళదు! అలాంటి గోదాదేవి తిరుప్పావై ప్రబంధములో మొట్ట మొదటి పాశురంలో 'కదిర్మతియంబోల్ ముకత్తాన్' అని కీర్తించిన తీరు "తీక్షణమైన కిరణాలు కలిగినటువంటి సూర్యుని పోలిన ఒక కన్ను శత్రు నిగ్రహమును (దుష్ట శిక్షణ) మరియు చల్లనైన కిరణాలు కలిగినటువంటి చంద్రుని పోలిన ఇంకొక కన్ను భక్తుల రక్షణమును (శిష్ట రక్షణ) సూచించే విధముగా ఉన్నది". పాశురములోని ఈ వాక్యములు హిరణ్యకశిపు సంహారము ప్రహ్లాద రక్షణకై అవతరించిన శ్రీ నృసింహ స్వామినే సూచిస్తుందని తెలుస్తున్నది. అటుపై

"మారిమలై ముళంజిల్ మన్నిక్కిడందురంగుమ్" అనే ఇరవై మూడవ పాశురములో ఉన్న శయనమందిరములో ఉన్న శ్రీకృష్ణుడుని శ్రేష్టమైన సింహా



**శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు**

సనముపై కూర్చొనవలసినదిగా గోదాదేవి ఆజ్ఞాపిస్తూ. పరాక్రమము కలిగిన సింహము గుహనుండి బయటకువచ్చే విధమును అత్యద్భుతముగా వర్ణిస్తుంది 'శీరియసింగం అఱివుత్తు తీవిళిత్తు వేరి మయిర్ పొంగ ఎప్పాడుమ్ పేర్న్దరి మూరినిమిర్న్దు ముళంగి పుఱప్పట్టు పోదఱుమాపోలే నీ పూవై పూవణ్ణా' అట్టి వర్ణనను సేవించటము ద్వారా ఆ సింహాసనప్పాట్టు పాశురంలో ఠీవి ఉట్టిపడేట్లు నడుస్తూ వచ్చి సింహాసనము మీద కూర్చుని మన విన్నపాలను విచారించి తెలుసుకుని మన కోర్కెలు తీర్చువాడు 'యామ్ వంద కారియమ్ ఆరాయిందు అరుళేలో రెమ్బావాయ్' ఆ నృసింహుడే అని స్పష్టమవుతున్నందు వల్ల, తిరుప్పావైలో ఆ నృసింహస్వామి విశేషముగా కీర్తింపబడినాడు అని తెలుస్తున్నది.

**నాచ్చియార్ తిరుమొళిలో శ్రీనృసింహ వైభవము:**

పరమాభక్తి ఆ స్వామిని పొందకపోతే ప్రాణములతో నిలిచి ఉండలేని స్థితి పరిపాక దశలో ఉన్నటువంటి గోదాదేవిని అనుగ్రహింప దలచిన పురుషోత్తముడైన ఆ

# అంతా నృసింహ మయమే

శ్రీమన్నారాయణుడు స్వప్న రూపములో (కలలో) వైదికముగా ఆమెను వివాహమాడిన ప్రక్రియను అంతా అనుభవింప చేస్తాడు. అట్టి అలౌకిక స్వప్న అనుభవాన్ని గోదాదేవి తన తోళితో ఇష్టసఖితో/ స్నేహితురాలితో వర్ణించేదే నాచ్చియార్ తిరుమొళి అనే ప్రబంధములోని ఆరవ దశకమైన 'వారణమాయిరమ్'. అందులోని తొమ్మిదవ పాశురములో చివరి రెండు పాదములు "అరిముగన్ అచ్చుతన్ కైమేల్ ఎన్ కైవైత్తు పొరిముగందట్ట కనాక్కండేన్ తోళీనాన్" ఏం చెప్తున్నాయంటే. ఓ చెలీ (సఖీ) వివాహ ప్రక్రియలో లాజహోమం అని చెప్పబడిన వైదిక కార్యాన్ని "సింహం వంటి ముఖం కలిగినవాడై ఉండే ఆ స్వామి చేతిపై నా చేతినిపెట్టి లాజలను (పేలాలు) ఉంచి సమర్పించినట్లు నేను స్వప్నములో చూసితిని అని వివరిస్తుంది. దీన్నిబట్టి ఆ స్వామిని పొందకపోతే ప్రాణములు నిలుపుకోలేని శ్రీఆండాళు కు స్వప్నములో కనిపించి ప్రాణం నిలిపుకునేట్లు అనుగ్రహించింది ఆ నృసింహ స్వామియే అని తెలుస్తున్నది.

**"అంతా నృసింహ మయమే" శ్రీరామాయణంలో మనకు కనిపించేది శ్రీనృసింహుడే**

శ్రీరామాయణంలో మనకు నృసింహుడు కనిపించటం ఏమిటి? అని ఒకింత ఆశ్చర్యముగా అనిపిస్తుంది. ఒకట్రెండు సందర్భములు చూద్దాము. లక్షణస్వామిచే విరూపిత అయిన శూర్పణఖ తన అన్నలైన ఖర దూషణాదులతో మొరపెట్టుకొనగా వారు శ్రీరామునితో యుద్ధము చేయుటకు సన్నద్ధులవగా పదునాలుగు వేల మంది రాక్షసులను శ్రీరాముడు మూడు ఘడియలలో (డెబ్బై రెండు నిమిషాలు) సంహరించాడు. అందు ఒక్క అకంపనుడు అను పేరు గల రాక్షసుడు ఏట్లో తప్పించుకుని రావణునికి ఈవార్త వినిపించెను. క్రోధముతో మూర్ఛిల్లిన రావణుడు తేరుకుని జనస్థానములో మహావీరులైన రాక్షసులను సంహరించింది ఎవరు అని కుపితుడై అడుగగా ఆ అకంపనుడు రావణునియొక్క తీక్షణ రూపమును చూచి వణుకుచున్న వాడై ఇట్లనెను.

"పుత్రో దశరథస్యాస్తి సింహసంహననో యువా।
రామోనామ వృషస్కన్ధో వృతాయుత మహాభుజః॥"

అరణ్యకాండ ముప్పై ఒకటవ సర్గ. దీని తాత్పర్యమేమనగా ఓ ప్రభూ దశరథుని కుమారుడు శ్రీరాముడను పేరు గలవాడున్నాడు. అతడు సింహము వంటి గంభీరమైన అవయవ సంస్థాన విశేషము కలవాడు. బలిష్ఠమైన భుజములు కలవాడు అని వర్ణిస్తాడు. అంటే అక్కడ అకంపనుడు దర్శించినది ఉగ్ర నరసింహుడినే కదా! మరొక సందర్భము చూద్దాము! అధర్మాత్ముడైన రావణుని వదిలి విభీషణుడు నలుగురు రాక్షసులతో కూడి శ్రీరామలక్షణులు మరియు వానరసేన ఉన్నటువంటి సముద్ర తీరంలో ఆకాశంలో నిలబడి ధర్మాత్ముడైన శ్రీరాముని శరణు వేడతాడు. వచ్చిన విభీషణుని ఆహ్వానించటము ఎంతమాత్రమూ తగదు అని పలువిధాలుగా తన అభిప్రాయాన్ని చెప్తున్న సుగ్రీవునితో ఎక్కడ శ్రీరాముడికి ప్రమాదం వాటిల్లుతుందో అనే భయముతో సుగ్రీవుడు తాత్సారం చేస్తూ ఉన్న సందర్భము శ్రీరాముడు ఇలా అంటాడు.

"పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్।
అంగుళ్యగ్రేణ తాన్ హన్యామ్ ఇచ్ఛన్ హరిగణేశ్వరః॥
(యుద్ధకాండ)

తాత్పర్యము: శ్రీరామ చంద్ర ప్రభువు ఇలా అన్నాడు, 'ఈలోకంలో ఉన్న సకల పిశాచులు, దానవులు, యక్షులు, రాక్షసులు మూకుమ్మడిగా వచ్చినా సరే నన్నేమీ చేయలేరు సరికదా నేను సంకల్పం చేస్తే ఓ సుగ్రీవా! వారందరిని నా యొక్క వేలు అగ్రముతో వధించగలను అంటే వేలి గోరుతో వధించగలను అని.'

మరి వేలుయొక్క అగ్రము అంటే గోరు కదా. గోరులో సుదర్శన చక్రాన్ని కలవాడు ఎవడు? శ్రీనృసింహుడే కదా! దీన్ని బట్టి కూడా శ్రీరామాయణములో మనకు దర్శనమిస్తున్నది శ్రీనృసింహుడే అని తెలుస్తున్నది కదా! ఇలా చెప్తూ పోతే సర్వం శ్రీనృసింహమయముగా ప్రకటనమవుతుంది. అట్టి శ్రియఃపతి, అనంతకళ్యాణ గుణాత్మకుడు, అఖిలహేయ ప్రత్యనీకుడు, సర్వవ్యాపకుడు, శాసకుడు అయిన శ్రీలక్ష్మీ నృసింహుడు మనలను సదా కాపాడుగాక!

# సీతమ్మ వైభవము

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్యరత్నములలోని నాలుగవ వాక్యములో తెలిపిన సీతమ్మ పాతివ్రత్యము గురించి ఆమె తెలిపిన విషయాన్ని తెలుసుకుందాము**

“దశముఖనై శెత్తేనో పిరాట్టియై ప్పోలే” అంటారు తన పాతివ్రత్యం చేత దశకంఠుడైన రావణాసురుని చంపిన సీత వలె అంతటి పాతివ్రత్యం కలిగి ఉన్నానా అంటుంది పెణ్ పిళ్ళై.

సీతమ్మ వైభవాన్ని ఆమె ఇలా తెలియజేస్తున్నారు.

సీతమ్మ దేవదేవుడైన ఆ శ్రీరామచంద్రుని దివ్య మహిషి అయిన లక్ష్మీయే! ఆమెయే సీతగా అవతరించినది కనుకనే హనుమ చేత దేవిగా ఆరాధించబడినది. ఆమె జగన్మాత కనుకనే తల్లివలె జీవులకు సర్వేశ్వరునకు మధ్యవర్తినియై జీవులను సర్వేశ్వరునితో చేర్చునదిగా ఉన్నది. దానికి ఉదాహరణయే ఘటకురాలిగా విభీషణుని రామునితో కలయికకు పరోక్షముగా సహాయయపడింది. రావణుడు వినకపోయినను భగవానుడగు శ్రీరామచంద్రునితో మైత్రి చేసుకొమ్మని ఉపదేశించి ఘటన చేయడానికి ప్రయత్నించింది.

జీవుని వలె ప్రవర్తించుతూ, పరమాత్మకు దూరమైన జీవుడు, మరల పరమాత్మను చేరుటకు ఎలా ప్రవర్తించాలో, ఆంతరముగా ఉపదేశిస్తుంది. బాహ్యముగా పతివ్రతయగు స్త్రీ భర్తకు దూరము ఉన్నప్పుడు ఎట్లు ప్రవర్తించాలో కూడా ఉపదేశిస్తుంది. శ్రీవచన భూషణములో తెలిపినట్లుగా

‘పురుషకార మామ్బోదు, కృపైయుమ్, పారతంత్ర్యము అనన్యార్హత్వముమ్ వేణుమ్’ అంటారు పిళ్ళైలోకాచార్యులు

అనగా పురుషకారమునకు కృప, పారతంత్ర్యము, అనన్యార్హత్వము అనే మూడు గుణములు ఉండవలెను. ఎలా అంటే.

కృప: అనగా ఇతరుల దుఃఖమును సహింపలేకపోవుట.

పారతంత్ర్యము : అనగా పరమపురుషునికి వశమై ఉండుట.

అనన్యార్హ శేషత్వము :- అతనికి గాక, మరెవ్వరికి వశపడక ఉండట,

ఈ మూడు గుణములు పురుషకార భూతురాలైన పిరాట్టి (అమ్మ) వద్ద ఉంటాయని మనకు తెలుసుకునే విధమును తెలియ చేస్తున్నారు.

జనక మహారాజుకు పుత్రికగా ఆవిర్భవించింది అమ్మ. ఆ భగవంతుడైన శ్రీరాముని మూడు



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

మారులు విశ్లేషించి (విడిపోయి) మూడు గుణములను ప్రశాశింప చేసింది కనుక దానిని బట్టే తెలుసు కొనగలము.

మొదటి విశ్లేషము: రావణుడు వేరుపరచుట అనే వ్యాజ్యము చేత మొదటగా పెరుమాళ్ళ నుండి (శ్రీరాముని నుండి) విడివడి లంకకు చేరింది. జీవుల యందలి కృపచేత, దేవతా స్త్రీల చెరను విడిపించుటకు తాను చెరలోపడి, రాత్రింపగళ్ళు చెరలో రాక్షస స్త్రీలు హింసింపగా సహించినది సీతమ్మ. త్రిజట తాను కన్న కలను గురించి మిక్కిలి భయపడగా, నేనుండగా మీకు భయమెందుకు అని అభయ ప్రదానము చేసింది. ఆమాట వ్యర్థము కాకుండా, రావణ సంహార అనంతరం మంగళవార్తను తెచ్చిన హనుమ, రాక్షస స్త్రీలను, దండించబోగా, అతనిని బ్రతిమిలాడి వారిని సంరక్షణ చేసినపుడు కృపాగుణము ప్రకటితము అయినది. ఈ గుణమును తెలియచేయుటకే మొదటిసారి సీతాపిరాట్టి స్వామిని విశ్లేషించినది. (వదిలి వెళ్ళినది)

ఇక రెండవ విశ్లేషము:-

లోకాపవాద పరిహారముకై పెరుమాళ్ళు అడవికి పంపుటకు ఆమెను ఆజ్ఞాపించిరి. ఆవిశ్లేషణకు ఫలము పెరుమాళ్ళు తనను అంతఃపురంలో ఉంచినా, అడవిలో ఉంచినా ఏ భేదమూ లేక ఆయన మనసు తెలిసి (తిరు ఉళ్ళము) అనుసరించి పారతంత్రమును, తెలియచేసింది.

శ్రీరాముని ఆజ్ఞ మేరకు లక్ష్మణ స్వామి, అమ్మను రథముపై, తీసుకుని వెళ్ళి, గంగాతీరమున వదిలి,

కారణము తెలుపగా, గొంతెత్తి, ఏడ్చి, ప్రాణత్యాగము చేయుదునని, మరల గర్భిణిగా ఉన్న తాను ప్రాణ త్యాగం చేసినట్లైతే సంతానము నశించును, రఘు వంశము, పాడగును, రామునికి స్త్రీహత్య చేసిన దోషము వచ్చునని అనేక విధాలుగా విలపించింది. శ్రీరాముని యోచనను అనుసరించి, తన ప్రాణమును నిలుపుకొని తన పారతంత్ర్యతను ప్రకాశింపచేసింది. ఈగుణము ప్రకాశింప చేయుటకే రెండవ విశ్లేషము.

ఇక మూడవ విశ్లేషము:

పెరుమాళ్ళు సీతమ్మ సన్నిధికి వచ్చి యుండగా పుట్టినింటికి, అనగా భూమిలో ప్రవేశించిన విషయం ఈవిశ్లేషము. అమ్మ యొక్క అనన్యార్హత్వమును ప్రకాశింపచేసినది. స్వామి ఎదుట చేతులు జోడించి, శిరసు వంచి దాసురాలను స్వామీ! పెరుమాళ్ళను తక్క మరి ఎవరినీ కూడా మనసులో కూడా చింతించని దానినైతే ఈ భూదేవి నాకు చోటును ప్రసాదించు గాక అని శపథము చేయగా, భూమిలో నుండి, ఒక దివ్య సింహాసనము రాగా, భూమాదేవి ఆమెను రెండు చేతులతో ఎత్తి, ఆసనములో కూర్చుండజేసెను. వెంటనే పిరాట్టి భూతలములో ప్రవేశించుట చూచి, దేవతలంతా పుష్పవృష్టి కురిపించి, స్తోత్రం చేశారని ఉత్తర శ్రీరామాయణంలో చెప్పబడుటచేత, ఈ మూడవ విశ్లేషణలో అనన్యార్హత్వము ప్రకటితమైనది.


ఈవిధంగా సీతమ్మయందు భిన్న రూపములు కనపడును. కనుకనే ఆమెను అన్ని రూపములతో మనము దర్శిస్తూ, ఆమె యొక్క ఉపదేశాలు గ్రహించవలెను. అంటూ తిరుక్కోళూరు పెణ్ పిళ్ళైగారు, నాల్గవ వార్తను తెలియచేశారు. ★


# పుస్తక పరిచయం

## ఉత్సవ సార సంగ్రహము

ప్రథమ, ద్వితీయ భాగములు

ప్రధానంగా పాంచరాత్ర వైఖానస ఆగమ విధానాలే ఎక్కువ దేవాలయాల్లో కొనసాగుతున్నాయి పాంచరాత్రాగమంలో పరిశోధనలు జరిపి తాళపత్ర గ్రంథ సేకరణ చేసి ఎన్నో గ్రంథాలను వెలయించారు శ్రీమాన్ శ్రీ డాక్టర్ రేజేటి వేంకటవేణుగోపాలచార్యులవారు. టీటీడీ నుండి వీరి ప్రామాణిక పరిశోధనా గ్రంథాలు ప్రచురించ బడ్డాయి. వీరు రచించిన 'ఉత్సవ సార సంగ్రహము' ప్రథమ ద్వితీయ భాగములు ఆంధ్రపాంచరాత్ర ప్రచురణలు కొంతమూరు రాజమహేంద్రి 2 నుండి ప్రచురించబడ్డాయి ఈ గ్రంథములు ఒక్కొక్కటి 400 పేజీలతో ముందు మాటలుగా గ్రంథకర్త అనుభవాలు ప్రముఖుల అభిప్రాయ విశేషాలు కనిపిస్తాయి. ప్రథమ భాగంలో ప్రార్థనతో ప్రారంభించి భూతశుద్ధి మొదలుకొని అన్ని కాలాల పూజావిధులు వత్సర నైమిత్తి పవిత్రారోపణాది ఉత్సవాలు శ్లోక ప్రమాణాలతో సంహితల లోని విశేషాలతో సమగ్రంగా వివరించబడ్డాయి. ద్వితీయ భాగంలో విష్ణు తత్వ సంహిత అధ్యయన విధి మొదలుకొని కొన్ని సంహితలలోని ఉత్సవ విధానాలను వివరిస్తూ శ్లోకము మరియు వివరణలతో స్పష్టంగా సాగుతుంది ప్రథమ భాగంలో 200 ద్వితీయ భాగంలో 92 శీర్షిక ఉప శీర్షికలతో ధనుర్మాస కృత్తిక దీపోత్సవం, రక్షాబంధనం మొదలగు అన్ని ఉత్సవాలే కాకుండా శ్రీరంగాది క్షేత్రాలలో నిర్వహించు విధానాలు కూడా తెలుపబడ్డాయి. దేవాలయ ఉత్సవ నిర్వహణకు వీలుగా పరిశీలన గ్రంథాలుగా ఇవి ఉపయోగపడతాయి. ఆసక్తిపరులకు విశేషాలు తెలుసుకొనుటకు కూడా స్పష్టమైన వివరణలతో చక్కని ముద్రణ తో ఉత్సవ సార సంగ్రహము ప్రథమ ద్వితీయ భాగములు ఆంధ్ర పాంచరాత్ర సంహితాసార సర్వస్వముద్వారా అందరికీ అందుబాటులో ఉన్నాయి వీటి వెల ఒక్కొక్క భాగము 300 రూపాయలు. లభించు ఫోన్ నెంబర్ 93463 60 891 ★







# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

అష్టభాగ ద్వార నిర్ణయము, నవభాగ ద్వార నిర్ణయములని "వాస్తుసార చక్రాదర్శము" అనే గ్రంథము ఆధారముగా తెలుపబడినది. తూర్పు దిక్కున ఈశాన్యం మొదలుకొని ఆగ్నేయము వరకు ఎనిమిది భాగాలుగా చేసి వాటిలో శుభ ప్రదమయిన భాగముల యందు బహిర్ దార్వమును నిలుపవలెను. అట్లాగే ప్రదక్షిణముగా అనగా పడమర ఉత్తర దిశలయందు కూడా ఎనిమిదేసి భాగములు చేసి ఆయా భాగములందు బహిర్ ద్వారమును ఏర్పాటు చేస్తే కలిగే ఫలితాలను తెలుసుకొనవచ్చును. ఆయా ఫలాఫలములు తెలుసుకొని ద్వార నిర్ణయము చేసుకోవలెను. క్రింది చక్రములో నాల్గు దిశలయందలి భాగముల యొక్క ప్రత్యేక ఫలములు చూపబడినవి.




అట్లే నవభాగ ద్వార నిర్ణయము కూడా చెప్పబడినది. తూర్పు మొదలగు నాలుగు దిక్కుల యందు తొమ్మిదేసి భాగములు చేసి అనగా

ఈశాన్యం మొదలుకొని ఆగ్నేయం వరకు 9 భాగములు చేయవలెను. అట్లే దక్షిణం వైపు ఆగ్నేయం మొదలు నైరుతి వరకు 9 భాగములు. పడమర వైపు ఆగ్నేయం మొదలు వాయవ్యం వరకు 9 భాగములు. అట్లే ఉత్తరం వైపు వాయవ్యం మొదలు ఈశాన్యం వరకు 9 భాగములు చేయవలెను. అట్టి తొమ్మిది భాగములకు రవి, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహు, కేతులధిపతులు. కనుక శుభగ్రహాధి పత్యము గల భాగముల యందు బహిర్ ద్వారములు నిలపవలయును.

బహిర్ ద్వారమునకు నవభాగ వివరణ చక్రము.

| భాగ సంఖ్య | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అధిపతులు | సూ | చం | కు | బు | గు | శు | శ | రా | కే |
| శుభా శుభ ఫలము | అ | మ | మ | ప | దే | మను | అ | అ | అ |

అ= అశుభములు, మ=మధ్య ఫలం, ప=పశువులకు,
దే= దేవతా గృహములకు మను= మనుష్యులకు

అలాగే మాస ద్వార నిర్ణయము కూడా చెప్పడినది. శ్రావణంలో నిర్మిస్తే తూర్పు ద్వారము, కార్తీకంలో నిర్మిస్తే దక్షిణంలో ద్వారము. మాఘమాసమందు నిర్మిస్తే పశ్చిమ ద్వారము వైశాఖమాసమందు నిర్మిస్తే ఉత్తరదిశలో ద్వారము ఏర్పాటు చేయివచ్చునని శాస్త్రోక్తి

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక జగిత్యాల గారిచే

54వ భాగవత సప్తాహ ప్రవచనములు

24-07-2024 నుండి 01-08-2024 వరకు, శృంగేరి శంకర మఠం, మేదరమిట్ట, తిరుమల

# భగవంతునిపైన భారము

వేదాంత దేశికులవారి న్యాసదశకమునందు శరణాగతి, ప్రపత్తి, దానిని అనుష్ఠించే విధానము, తెలుపబడినది. మరియు పది ముఖ్యమైన సంక్షిప్తమైన, సకల తత్త్వార్థాలూ ఇమిడిన శ్లోకాలు గూర్చబడినవి, దశకం అంటే పది న్యాసమంటే శరణాగతి, ప్రపత్తి అని. మొదటి శ్లోకము శరణాగతి అంటే ఏమిటి? అని వివరించినదని చూశాము. తరువాత శరణాగతికి ప్రధానమైన 5 లక్షణాలను వివరిస్తూ వస్తున్నారు.

2 వ శ్లోకములో వాటిని మనము "అడైక్కల పత్తు" అనే దేశికుల వారి ప్రబంధాన్ని అనుసరించి వ్యాఖ్యానించుకొన్నాము. మనకు సర్వసాధారణముగా కలిగే సందేహాలను, కట్టెదుట కనిపించే వస్తువుల ఆధారంగా, ఎలా అర్థంచేసుకోవాలి? బెంబేలు పడిపోకుండా పరమాత్మ మీద గట్టి నమ్మకమును ఎలా పెంచుకోవాలి? అన్న సోపానమును అధిరోహించు రీతిలో ఒక్కో మెట్టూ తత్త్వపరంగా ఎక్కుతూ, కులశేఖర పెరుమాళ్, కోయిల్ తిరుమొళి ఆధారంగా విశదీకరించుకొన్నాము. ఇలా ఐదు అంగములను వివరించి ఆరవ అంగమైన ఆత్మ సమర్పణము అన్నది అంగి అని చర్చించుకొన్నాము! ఆఖరుగా స్వామి వేదాంతదేశికులవారే సాయించిన "అభయప్రధాన సారము" అనే గ్రంథము ఆధారంగా విశ్లేషణమును కొనసాగిద్దాము.

అభయము అనగా భయరహిత స్థితి. అది ఎప్పుడు ఏర్పడుతుంది? మనకు ఆపద ఏర్పడినప్పుడు మనలను మనము రక్షించుకోలేని హీన స్థితిలో వున్నప్పుడు ఎవరైనా నిన్ను నేను రక్షిస్తాను అని పలికితే, మనకు వారిమీద నమ్మకము ఏర్పడితే "వీరు మనలను తప్పక కాపాడుతాడు" అనే ధైర్యము వచ్చి నిశ్చింతగా వుండ గలుగుతాము! అలా మనకు భయమును పోగొట్టి నమ్మకమును చేకూర్చడమే అభయ ప్రదానము. అలా ఎవరు ఇవ్వగలరు? వారు సర్వసమర్థులై వుండాలి!

వాలిని జయించగల సామర్థ్యము నీకు వుందా అని సుగ్రీవుడు రాముల వారినే అడగలేదు. ఏడు తాళవృక్షాలను ఒకే వింటితో రాములవారు కూల్చిన పిదప కదా సుగ్రీవునకు నమ్మకము కుదిరింది. అలా 'సర్వ సమర్థుడు పరమాత్మ' అనే నమ్మకము మనకు కుదరాలి! పంచాయుధాలతో పరమాత్మ మనకు దర్శన మీయడానికి కారణమదే కదా! పరమాత్మ ఆయుధాలను ధరించకుండా మనశత్రువులను జయించి మనలను కాపాడగలరు.



**శ్రీమతి వంగల రాధిక**

శ్రీకృష్ణావతారములో తన చేతులను శంఖ చక్ర గదాది ఆయుధాలతో చూపించాడు. పసివాడిగా వున్నప్పుడే తన చిన్ని కాళ్ళను వుపయోగించియే రాక్షసులను దునుమాడాడు. కానీ మనము భీరువులం! అంత తొందరగా దేనినీ నమ్మలేము. సుగ్రీవుని లాంటి వారమనే పరమాత్మ పంచాయుధ ధారిగా మనకు దర్శన మిచ్చి మనకు అభయ మిస్తున్నారు.

ఈ అభయ ప్రదాన సారములో దేశికులు విభీషణ శరణాగతి ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నారు. రాక్షసుడైన విభీషణుడు రావణాసురుని తమ్ముడు. అతను సర్వము త్యజించి రాములవారు తనను రక్షించగలరన్న ధృఢ విశ్వాసముతో రాములవారిని శరణుకోరివచ్చాడు. విరోధించిన వానర మూకలతో

మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన।
దోషోయద్యపి తస్య స్యాత్ తథా మేతత్ అదర్హితం॥

అనే రామ చరమశ్లోకముతో, తన తిరువుళ్ళమును తేటతెల్లము చేశారు, రాములవారు.

పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్।
అంగుళ్యగ్రేణ తాం హన్యే ఇచ్ఛన్ హరి గణేశ్వర॥

అంటూ రాక్షసుడైన విభీషణుడు రామునికే హాని తలపెడతాడో అని భయపడే వానరాధిపతి సుగ్రీవునికి నచ్చజెప్పి ధైర్యము చేకూర్చారు కదా ! అంతేకాదు

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే।
అభయం సర్వ భూతేభ్యో దదామి ఏతత్ వ్రతం మమ॥

అంటూ సర్వ భూతాలనూ రక్షించే వాడిని నేనే అని అభయాన్ని ప్రకటించి ధైర్యాన్ని ప్రసాదించారు. ప్రాప్యము, ప్రాపకము రెండూ తానే అయి నిలిచారు స్వామి. ⇨

ప్రాపకము పరమాత్మయే అయిన ఇంక జీవాత్మ ప్రయత్నమే ఏమీ వుండదా? ఆత్మ స్వరూపమే పరమాత్మ దాస్యత్వమంటే, మరి ఇన్ని తత్వ బోధలు ఎందుకు? పునరపి జననం, పునరపి మరణాలెందుకు? ఈ అనుమానాలకు సమాధానమే శరణాగతి శాస్త్రము. కర్మలచేత ఏర్పడిన మసిని చెరిపితేనే గానీ ఆత్మ స్వరూపము ప్రకాశించదు. ఆత్మ స్వరూప జ్ఞానము ఏర్పడితేనే గానీ దాస్యత్వము సిద్ధించదు. దాస్యత్వము సిద్ధిస్తేనేగానీ పరమాత్మే మనకు రక్షకుడన్న నమ్మకము రాదు. ఆ నమ్మకము వస్తేనే గానీ, కైంకర్యాపేక్ష ఏర్పడదు. కైంకర్యాపేక్ష ఏర్పడితేనే గానీ, భక్తి ప్రపత్తులు వుత్పన్నము కావు. అవి వుత్పన్న మైతేనేగానీ, శరణాగతి సిద్ధించదు. స్వరూప ప్రవృత్త దాస్యము, పరమాత్మ కళ్యాణ గుణ కృత దాస్యముగా మారుతుంది. భగవద్విషయ ప్రవృత్తి, ప్రావణ్య మనేవి అతిమాత్ర స్నేహం క్రింద మారి, శేషశేషి భావం స్థిరపడుతుంది! కైంకర్యాపేక్షవరకు జీవాత్మ ప్రవృత్తం అవుతాడు! దానిని అంగీకరించి, అనుగ్రహించడము అనేది పరమాత్మ కృప!

ఈ తత్వ విషయపు ఆధారంగా, రామాయణములోనే మిక్కిలి శ్రేష్ఠముగా పేర్కొనబడే విభీషణ శరణాగతి యొక్క ప్రావణ్యము దేశికర్ తన అభయప్రధాన సారములో చెప్పారు! వ్యాఖ్యాన చక్రవర్తి అని ప్రసిద్ధి పొందిన ప్పెరియవాచ్చాన్ పిళ్ళై కూడా తన 'తని' శ్లోకీలో విభీషణ శరణాగతి యొక్క వైశిష్ట్యాన్ని బహు రమ్యంగా చిత్రీకరించారు!

ఈ అభయప్రధానసారము పది అధ్యాయాలు కలది. అందులో నాలుగవ అధ్యాయం, ప్రకరణ తాత్పర్యనిర్ణయం! ఈ మొత్తము కోశము యొక్క వుద్దేశ్యమే శరణాగతి! అదే అభయప్రదముకదా! ఆ శరణాగతి 5 అంగములతో కూడినది. అలాంటి 5 అంగములతో కూడిన శరణాగతి, విభీషణ శరణాగతిలో పరిపూర్ణముగా గోచరిస్తుందని ఇందులో ప్రస్తావించారు వేదాంత దేశికులు. రామాయణములో, ఆంజనేయులవారూ, సుగ్రీవాదులూ, అందరూ విభీషణుడు రాజ్యకాంక్ష తోనే శరణాగతి చేస్తున్నాడని పేర్కొనడము మనము చూస్తాము. కానీ దేశికర్ అది తప్పు. విభీషణుడు రామకైంకర్యాపేక్షతోనే శరణాగతి చేస్తున్నాడని, రామాయణాన్ని ప్రమాణముగా స్వీకరించే నిరూపిస్తున్నారు. అభయప్రధాన సారమనే కోశములో (4 వ అధ్యాయములో) అసలు రామాయణమే ఒక శరణాగతి శాస్త్రము. రామాయణానికి మరో పేరే శరణాగతి శాస్త్రము. 6 కాండాలలోనూ శరణాగతి చూపబడింది అని వీరు వివరించారు.

బాలకాండములో దేవతల శరణాగతి చూపబడింది. మహావిష్ణువును శరణాగతి కోరుతున్నారు వారు. 'జహ్నో విష్ణుర్సనాతనః' మమ్మల్ని రావాణాసురుడు మొదలగు రాక్షసుల బారినుండి కాపాడమని వేడుకొంటున్నారు.

అయోధ్యాకాండములో లక్ష్మణ శరణాగతి చూపబడింది.

"సభ్రాతు శ్చరణౌగాఢం నిపీడ్య రఘునందనః।
సీతా మువాచాతియశా రాఘవం చ మహావ్రతం॥
యది గంతు కృతా బుద్ధిర్వనం మృగగజాయుతం।
అహం త్వా మనుగమిష్యామి వనమగ్రే ధనుర్ధరః ॥
ధనురాదాయ స శరం ఖనిత్ర పిటకాధరః।
అగ్రతస్తే గమిష్యామి పంథాన మనుదర్శయన్॥
భవాంస్తు సహ వైదేహ్యా గిరి సానుషు రంస్యతే।
అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చతే॥

ఇలా లక్ష్మణస్వామి రాములవారిని, మృగాలతో నిండివున్న అరణ్యంలో నేను ముందు ధనుర్ధారియై నడుస్తుంటాను. సీతామాతతో నీవు వనాల్లో కొండల్లో హాయిగా విహరిస్తూవుంటే, నీకు సకల కైంకర్యములను సమర్పించుకొంటాను అంటూ సీతా పిరాట్టిని ముందుంచుకొని కైంకర్యాపేక్షను ప్రదర్శిస్తూ, శరణాగతి చేస్తాడు.

తరువాత అరణ్యకాండంలో దండకారణ్యంలోని ఋషులు, మునులు రాములవారి వద్దవచ్చి శరణాగతి కోరుతారు. "ఋషయో అభ్యాగమన్ సర్వే వధాయాసుర రక్షసామ్" ఒక తల్లి తన గర్భమును రక్షించుకొనే రీతిలో ఖరదూషణాది రాక్షసుల వద్దనుండి తమను రక్షించాలని వేడుకొంటారు. తమ ఖండిత శరీరాలను చూపుతూ రాక్షస పీడయొక్క బాధలను వ్యక్తీకరిస్తారు. "అర్థితాం స్మ భృశం రామ భవాన్ నస్త్ర రక్షతు" అలా వారి శరణాగతి అరణ్యకాండములో సాగుతుంది.

కిష్కింధాకాండ సుగ్రీవ శరణాగతి! తన సోదరుడైన వాలి బారినుండి తనను కాపాడమని ప్రార్థిస్తాడు.

హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః।
తత సుగ్రీవ వచనాత్ హత్వా వాలిన మాహవే॥

వాలిని తన శరాఘాతముతో హతమార్చి సుగ్రీవునకు రాజ్యాభిషేకం చేస్తారు రాములవారు. అలా సుగ్రీవ శరణాగతి సఫలమయ్యింది. (మిగతా 26 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# సాధన - బోధన

శ్రీమన్నారాయణుడు ఈ లోకంలో సామాన్య మానవుడిగా అవతరించాడు. దశరథ చక్రవర్తి కుమారుడుగా, రాముడుగా అవతరించాడు. ఆళ్వార్లందరు చక్రవర్తి తిరుమగన్ అని కొనియాడారు.

యధా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

అని భగవద్గీతలో చెప్పినట్లుగా ధర్మసంస్థాపన కోసం అవతరించాడు. రావణాసురుని వరాలకు అనుగుణంగా సామాన్య మానవుడిగా పన్నెండు నెలలు కౌసల్య గర్భంలో గర్భవాసం చేసి, ఈ లోకంలో పుట్టాడు. గురుకులవాసం చేసి విద్యాభ్యాసం చేశాడు. తండ్రి మాటకు కట్టుబడ్డాడు, పెద్దలను, ఆచార్యులను గౌరవించాడు. ప్రజలను ప్రేమించాడు. సీతను వివాహం చేసుకుని సంతోషించాడు, ఆమె కనపడనప్పుడు దుఃఖించాడు. ఒక రాజు రాజ్యాన్ని ఎలా పరిపాలించాలో అలా పరిపాలించి చూపాడు. కొడుకుగా తల్లిదండ్రుల పట్ల భక్తి, గౌరవం, నెరపాడు. అన్నగా బాధ్యత వహించి తమ్ముళ్లకు మార్గదర్శిగా ఉన్నాడు.

ఆటవికుడైన గుహుడు, వానర జాతికి చెందిన సుగ్రీవుడు, అసుర జాతికి చెందినవాడు, పైగా సీతను అపహరించిన రావణాసురుడి తమ్ముడైన విభీషణుడు వంటి మిత్రుల మధ్య భేద భావం లేకుండా సమానంగా చూశాడు. సుఖదుఃఖాలు సమానంగా స్వీకరించాడు. సర్వభూతాలను సమానంగా ఆదరించాడు. తనకు ఎవరు ఏది ఇచ్చినా అది చిన్నదైనా ,పెద్దది అయినా ప్రేమతో తీసుకున్నాడు. ఆచార్యుల దగ్గర, ఋషుల దగ్గర నిరంతరం అధ్యయనం చేస్తూ వచ్చాడు. ఎవరిని ద్వేషించలేదు. ఇంద్రియ నిగ్రహం పాటించాడు. ఇలా ఎన్నో విషయాలు ఈ లోకంలో జనులు ఆచరించాల్సినవన్నీ తాను ఆచరించి చూపించాడు. కానీ లోకంలో జనాలకు అవి ఒంటబట్టలేదు.

అందుకని అవే విషయాలను ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడుగా అవతరించి అర్జునుణ్ణి వ్యాజం చేసుకుని ఉపదేశించాడు. అదే భగవద్గీత. కృష్ణావతారంలో ఉపదేశం ఇచ్చాడు. రామావతారంలో ఆచరణ చేసి చూపించాడు. ముందు ఉపదేశించి తరువాత ఆచరించి చూపాలి కదా! అని ఇక్కడ మనకొక సందేహం రావచ్చు. మనం ఏది ఆచరించామో దానిని లోకానికి ఉపదేశించాలి. అప్పుడే లోకం దానిని ఆమోదిస్తుంది. మనం



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

ఆచరించకుండా కేవలం ఉపదేశం చేస్తే దానికి ఫలితం ఉండదు, ఎవరూ ఆమోదించరు. ఉపదేశించి తర్వాత ఆచరించినా ఫలితం ఉండదు. అందుకనే ముందు రాముడుగా అవతరించి, ఆచరించి చూపించాడు. తర్వాత కృష్ణుడుగా పుట్టి భగవద్గీతలో ఉపదేశించాడు.

రాముడు సాధన చేసినవి, కృష్ణుడు బోధించిన స్థాలీపులాక న్యాయంగా కొన్ని చూద్దాం.

1. కృష్ణుడు

సుఖ దుఃఖే సమే కృత్వా లాభా లాభౌ జయా జయౌ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి॥

(2.28) అని గీతలో చెప్పాడు

అంటే సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలి, లాభనష్టాలను సమానంగా భావించాలి. కష్ట నష్టాలను సమానంగా తీసుకోవాలి అని అర్జునుడితో చెప్పాడు. అది ఎలా సాధ్యం కృష్ణా? అని అర్జునుడు తన సందేహాన్ని వెలిబుచ్చాడు. దానికి కృష్ణుడు రాముడుగా అవతరించినప్పుడు నేనది చేసి చూపించాను అర్జునా అని చెప్పాడు. ముందు రోజు రాత్రి నీకే పట్టాభిషేకం అన్నారు. తెల్లవారి నీకు రాజ్యం లేదు వనవాసానికి వెళ్లాలి అని చెప్పారు. రెంటినీ ఒకే లాగ స్వీకరించాను. ముందు రోజు నీకే రాజ్యం అన్నప్పుడు ఎలా ఉన్నానో తెల్లవారి నీకు రాజ్యం లేదు వనవాసానికి వెళ్లాలి అన్నప్పుడు ⇨

## సాధన - బోధన

కూడా అదే నిబ్బరంతో ఉన్నాను. రాజ్యం లభించలేదని నేను ఆందోళన పడలేదు అర్జునా అని చెప్పాడు.

2. కృష్ణుడు

సమోహం సర్వభూతేషు న మే ద్వేష్యోస్తి న ప్రియః।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్॥

(9.29) అని గీతలో చెప్పాడు. నాకు దేని మీద మోహం లేదు, ఎవరి మీద ద్వేషం లేదు. ఒకరు ప్రియులు కారు, మరొకరు అప్రియులు కారు. నేను అందరిని సమానంగా చూస్తాను. నాకు మిత్రులు లేరు, శత్రువులు లేరు. నన్నాశ్రయించిన వారందరినీ సమానంగానే చూస్తాను' అన్నాడు. నన్ను భజించక నిలువలేని నా భక్తులు నన్ను సాటి వారిలా ప్రేమగా చూస్తారు. నేను వాళ్ళను నా కంటే గొప్ప వాళ్ల లాగా చూస్తాను. అని కృష్ణుడు చెప్పాడు.

అదే విషయాన్ని రాముడు ఆచరించి చూపించాడు. ఆటవిక జాతికి చెందిన గుహుడిని తమ్ముడని అన్నాడు. వానర జాతికి చెందిన సుగ్రీవుడిని తమ్ముడని అన్నాడు. సీతను ఎత్తుకు పోయిన పరమ పాపాత్ముడైన ఆ రావణుడి తమ్ముడు వచ్చినా ఆయనను కూడా తమ్ముడనే అన్నాడు. రాముడు అందరిని సమానంగా చూస్తాడనడానికి ఇంత కంటే గొప్ప ఉదాహరణ ఏముంటుంది? ఆటవికుడే అయినా, వానర జాతి అయినా, రాక్షసుడైనా ముగ్గురిని తమ్ముళ్ళు గానే చూసాడు. ఎవరిని ఎక్కువ తక్కువ చేయకుండా కాకుండా సమానంగా చూసాడు. ★

## బీర్పూర్‌లో శ్రీనరసింహ జయంతి



## భగవంతునిపై భారము

(24 వ పేజీ తరువాయి)

సుందర కాండము లో కాకాసుర శరణాగతి

"శిరుకాక్కై ములై తీణ్డ, మూవులగుం తిరిన్దోడి, విత్తగనే రామావో నిన్నభయం ఎన్ను అత్తిరమే అదన్ కణ్ణైఅరుత్తదువుం" ఇంద్రసుతుడు కాకాసురుడిగా వచ్చి సీతాపిరాట్టివద్ద అపచారపడి, రాములవారి కోపానికి, బ్రహ్మాస్త్రమైన దర్భకు భయపడి, ముల్లోకములు తిరిగి, ఎక్కడా ఆశ్రయము దొరకక, తలతిరిగి రాముని కాళ్ళమీద పడగా, అతని ప్రాణమును రక్షించి, అతని ఒక కన్నును మాత్రము బ్రహ్మాస్త్రము ఛేదించునట్లు కరుణ చూపిన రామ కథ చెప్పబడింది.

యుద్ధకాండం ఈ అన్ని శరణాగతుల కంటే గొప్పదైనది. విభీషణ శరణాగతి దీర్ఘ శరణాగతి! ఇది శరణాగతి యొక్క పంచ అంగములు గల శరణాగతి! ★

### శ్రీసన్నిధి పదకేళి (3) సమాధానాలు

విజేతలకు జూన్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది

నిలువు

1. సుమంత్రుడు 2. నందిగ్రామం 3. 24000
4. జటాయువు 5. భవిష్యపురాణం

అడ్డం

5. భగీరథుడు 6. ఏడు 7. మాసం
8. తార 9. పూరి 10. ఇక్ష్వాకు 11. విభీషణుడు
12. పుత్రకామేష్ఠి 13. షష్ఠి

సరియైన సమాధానాలు పంపినవారు:

వనమాల రామలింగాచారి, యాదగిరి గుట్ట
బిక్కనూరు రాజేశ్వర్, నిర్మల్
వై. శివప్రసాద్, బోయవాడ, కరీంనగర్
జి. సువర్ణ, సిరిసిల్ల,
సి. హెచ్. మురళీకృష్ణ, కూకట్‌పల్లి, హైదరాబాద్

# భారతము పంచమవేదము

శ్రీమాన్ శ్రీ డా.అప్పన్ కందాడై పెరుమాళ్ళాచార్యులు



"ఉతత్వపశ్యన్నదదర్శవాచం ఉతత్వశృణ్వన్నశృణోత్యేనాం,
ఉతత్వస్యం తత్వం విసస్రే జాయేవపత్యుః ఉశతీ సువాసాః"
అని వేదవాక్యము.

చంద్రశాలయందు తిరుగుచున్న పతివ్రతాస్త్రీని భిక్షగాడు చూచినాడు. గాజుల బేపారి ఇంటిలోకి వచ్చి చేతినిబట్టుకొని గాజులను తొడిగినాడు. కంసాలి నగను తయారుచేసి తెచ్చి ప్రక్కన కూర్చొని చెవికి తొడిగినాడు. భర్త శయ్యపైనజేరి చేర దీసినాడు. ఐనను ఆమె మనసును విప్పిచూచే అనుభవము అందరితోను ఒక తీరుదే యనగలమా? అట్లే వేదమాతను ఒక్కొకడు ఒక్కొక విధముగ చూస్తాడు. కాని ఆమె మాత్రము తన బాహ్యశరీర, అంతర్హృదయ సౌందర్యాన్ని అందరితో పంచుకోదు. ఆమెయొక్క లావణ్యమును, పూర్తిగ యనుభవించగల వాడు ఆమెయొక్క ఆంతరంగికుడగు భర్త మాత్రమే. దీని భావము ఏమనగా

"ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్,
భిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రతరిష్యతి"
యని భారతమందలి సూక్తి.

వేదముయొక్క యర్థమును వేదాంగములు ఇతిహాసములు పురాణములతో సమన్వయించి వివరించవలసి యుంటుంది. ఏమాత్రము తేడాగా అర్థనిర్ణయమును చేసినా వేదమాత గజ్జున వణుకుతుందట! ఒక్కొకసారి ఏడుస్తుందట! పురుషోత్తమః వంటి వైదిక పదములకు పురుషులలో ఉత్తముడు అని తత్పురుషసమాసమును చెప్పినవానిని చూచి బాధ చెందుతుందట! అట్లే పురుషుడు వాడే ఉత్తముడు వాడే యని కర్మధారయ సమాసముగ చెప్పినవాని మాటకు ఆనందిస్తుందట!. ఇటువంటి విషయాలకు సంకేతాలుగా వేదములలోని స్వరములు ఏర్పరచబడినవి అంటారు పెద్దలు.

వ్యాకరణశాస్త్రము ప్రకారము వ్యవహారానికి కావలసిన భాషకు అక్షర, పద, వాక్య సముదాయాలు అవసరము. కర్తకర్మక్రియలతో గూడినవి వాక్యాలు. ఈ మూడింటిలో దేని విశేషణములు దానికి ఉంటాయి. గుణాభిరాముడు రాముడు. రాక్షసుడైన రావణుని సపరివారముగ చంపెను. మున్నగునవి ఉదాహరణములు. ఈవాక్యములో కర్త రాముడు, కర్మ రావణుడు, క్రియ చంపెను అనేవి. వీటిలో ప్రతియొకటి గుణాభిరాముడు రాముడు అన్నచోట గుణాభిరాముడు వంటి విశేషణములు అనేకము ఉండ వచ్చును. సమస్త గుణ అభిరాముడు వంటి సమాస పదముగ కూడా ఉండ వచ్చును. కలసికొనగల్గు యోగ్యతగల అనేకపదములు గలసి సమాసములుగ ఏర్పడి అనేక అర్థాలను బోధిస్తాయి. సమాసపదములను కూర్చేటపుడు వాటి కలయికలో (అల్పాచ్ తరం పూర్వం అన్న) వ్యాకరణ నియమము ప్రకారము అతిచిన్న పదముల నుండి అతి పెద్ద పదమువరకు క్రమముగ కూర్చవలయును. ఉదాహరణము నకు పురాణము అను పదమును ఇతిహాసము అను పదముతో కూడవలసి వచ్చినపుడు పురాణ మూడు అక్షరములుగల పదము, ఇతిహాస నాలుగు అక్షరములు గలది వీటిలో తొలుత మూడు అక్షరముల పదమును చెప్పి, తరువాత నాలుగు అక్షరములుగల పదమును దానికి కూర్చి సంధికార్యాదులు ఉన్నచో వాటిని అమర్చి పురాణ ఇతిహాసములు = పురాణేతిహాసములు అనవలయును.

ఈ విధానమును నిషేధించేలా మరొక (అభ్యర్హితంపూర్వం అను) సూత్రము వ్యాకరణమునందు ఉన్నది. దాని ప్రకారము కూడవలసిన పదాలలోని ప్రాముఖ్యమును అనుసరించి కలుపుచు చెప్పవలయును.

ఈ నియమము ప్రకారము ఇతిహాసములు ప్రధానములు గనుక వాటిని ముందు చెప్పుచు ఇతిహాసపురాణములు= ఇతిహాసపురాణములు అనవలయును. పైనగల శ్లోకములో రెండవ నియమము పాటించబడినది. దీనితో పురాణముల కన్న ఇతిహాసములకు ప్రాధాన్యము ఎక్కువయని స్పష్టమైనది. ఇతిహాసములు అనగా జరిగిన భగవదవతార చరితములు. అనగా పరమాత్మ ఇతడే, ఈతని వైభవములు ఇవి, అని స్పష్టంచేసి పరమాత్మ యొక్క అవతారవైభవాలను వివరించినవి. దీనికి ఉదాహరణములు

"కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్
పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః" అని వాల్మీకిచేత రచింపబడిన రామాయణ ఇతిహాస గ్రంథమందు మూడు విశేషణములు చెప్పబడినవి.

1 రామాయణము, 2. సీతాచరితము, 3. పౌలస్త్యవధము అని. మొదటి విశేషణము ప్రకారము రాముని చరితము రామాయణమైనది.

"మహత్వే చ గురుత్వే చ ధ్రియమాణం తతోధికమ్,
మహత్వాత్ భారవత్వాచ్చ వహాభారతముచ్యతే"

అని వేదవ్యాసులచేత రచింపబడిన మహాభారత ఇతిహాస గ్రంథమునందు మహత్వము గురుత్వము అను విశేషణములు రెండు చెప్పబడినవి.

మొదటి విశేషణము ఏమనగా మహత్వముతో లక్ష శ్లోకాలకు మించినదై పురాణ శాస్త్రాదులన్నిటికన్న విశాలమైనదగుట, మరియు మొదటి మూడు పురుషార్థములకంటే మించిన ఉత్తారకశక్తి (తరింప చేయగలది) కలదగుట అనే రెండర్థాలు గోచరిస్తాయి. అట్లే గురుత్వము. ఈ పదము గౌరవము కలిగి ఉండుట అని. (బరువు లేదా శ్లోకసంఖ్య యనవచ్చు) గౌరవ విశేషముతో పాటు అనేక ధర్మశాస్త్రాదుల పరిపూర్ణ బోధనను ఒనర్చేదిగా గోచరించుటను చూచుచున్నాము. కావుననే భారత ఇతిహాసము మహాభారతమైనది.

అందుచేత ధర్మబోధయందు ధర్మ ప్రవర్తనయందును ఇతిహాసపురాణములలో పురాణములకన్న ఇతిహాసములకు అధిక ప్రాధాన్యము ఇవ్వబడింది.

రామాయణ మహాభారతములలో రామాయణము ఇరువదినాలుగు వేల శ్లోకాలు గలది, కాని మహాభారతము లక్ష శ్లోకములు గలది. అంతేగాక నాలుగు లక్షల శ్లోకములుగల పదునెనిమిది(18) పురాణములన్నిటిని కలిపిన రాజస, తామస దేవతల వైభవము కన్నను అధికంగా సాత్విక దేవతకు సంబంధించిన వైభవాన్ని మహాభారతము తన స్వంతముగ జేసికొన్నది.

అదెక్కడ? భారతమనగానే పాలివారిపంచాయితి అంటారే! మీమాట ఎట్లు నమ్మేది! అనే ప్రశ్నయొకటి గలదు. దీనినిగూర్చి మొదట చర్చించాలి. ముందుగనే

"నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్"

అనుచు తొలుత నారాయణునకు, అనంతరమున (నారాయణుని తోడుగ నరుని అవతారముగ) అర్జునునకు, సరస్వతీదేవికి, వ్యాసునకు, ప్రణామసమర్పణతో మహా భారతము ప్రారంభమైనది. భారతమే ఆరంభమున

"భగవన్ వాసుదేవశ్చ కీర్త్యతేత్ర సనాతనః
సహి సత్యం ఋతం చైవ పవిత్రం పుణ్యమేవ చ,
శాశ్వతంబ్రహ్మ పరమం ధృవం జ్యోతిః సనాతనమ్,
యస్య దివ్యాని కర్మాణి కథయంతి మనీషిణః,
అసచ్చ సదసచ్చైవ యస్మాద్విశ్వం ప్రవర్తతే"

భగవానుడైన వాసుదేవుడు ఇందు కీర్తింపబడినాడు. వాడు సత్యము, ఋతము (హృద్యమైనది), పవిత్రము, పుణ్యము, శాశ్వతము, బ్రహ్మ ఉత్కృష్టము, స్థిరమైనది, శాశ్వతమైనది, తనకుతానుగ వెలుగునది, ఆదిలేనిది, అది అసత్తు (సృష్టికి ప్రళయ కాల బీజరూపము) సత్తు (సృష్ట్యనంతర విశ్వ వృక్షరూపము) విశ్వప్రవృత్తిని నడుపునది, అట్టి పరతత్వముయొక్క వైభవమును అద్భుత కార్యములను మేధావులు కథలుగా చెప్పుకుంటారు, దాని చేతనే విశ్వము నడుపబడుచున్నది. అని చెప్పినది. ఇంకను ఇంత విశదమైన వైభవముగల గ్రంథమును నిర్మించుటకు ఎన్ని గుండెలు కావలయును అనుచు, గుండెను పదిలము జేసికొని

భారతాఖ్యేతిహాసస్య పుణ్యగ్రంథార్థసంయుతాం,
సంస్కారోపగతాం బ్రాంహీం నానాశాస్త్రోపబృంహితామ్,
నారాయణస్య కృపయా కరస్థామలకం యథా
భారతే వ్యాసనిక్షిప్తం దర్శనీయం మనీషిభిః

భారతమను పేరుగల ఈ ఇతిహాసము నందు పుణ్యకరములైన గ్రంథములు విశేష ముగ గలవు. పూర్ణ శాస్త్ర సంస్కారమును ఇది కలిగిస్తుంది. నానాశాస్త్రములను ఇది విశేషముగ విసుగులేక వివరించింది. ఇంత చేయగలుగుట నారాయణుని కృపతో మాత్రమే సాధ్యము, ఇంకను విశేషముగ అరచేతి ఉసిరికాయలా ఎవరు చేసికోవాలన్నను నారాయణుడే సంకల్పించాలి. కనుక అట్లే జరిగింది. భగవానుడే స్వయముగ ఆవేశించగా ఆతని ఆవేశమున వ్యాసభగవానుడు మాత్రమే దానిని సాధ్యము జేసుకొన్నాడు. మేధావులు తాము తెలుసికొని వివరించ దగినట్లుగా పారమార్థిక ధనము యొక్క నిధిని లోకానికి ఇచ్చినాడు సేవించండి! అని భారతపు ముందు మాటలు ఉన్నాయి..

(మరికొంత వచ్చే సంచికలో)

# శ్రీరామక్రతువు సహస్ర కలశాభిషేకం

సైదాబాద్ రామాలయంలో మే 14 నుండి 23 వరకు శ్రీరామక్రతువు మరియు సహస్ర కలశాభిషేకం మహా వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారు పట్టాభిషేకానికి వేంచేసి స్వర్ణ కిరీటం, ఇతర లాంఛనాలు సమర్పించారు. సహస్ర కలశాభిషేకానికి శ్రీశ్రీశ్రీ దేవనాథజీయర్‌స్వామి, విజయవాడ శ్రీశ్రీశ్రీ అష్టాక్షరి జీయర్ స్వామి, బృందావన జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ అహోబిలజీయర్ స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొని మంగళాశాసనములు కృపచేశారు.



# ధర్మపురిలో చందనోత్సవము



# ప్రజ్ఞ శిక్షణాతరగతులు

బాల బాలికలలో సంస్కార వికాసం కొరకు వికాస తరంగిణి ద్వారా నిర్వహించిన ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. స్థానిక (కరీంనగర్ ) ఆండాళ్ గోష్ఠి, సప్తగిరి కాలనీ రామాలయం, ఆదిత్య నగర్ గణేష్ టెంపుల్ మొదలగు చోట్ల ఈ శిక్షణలు నిర్వహించారు.





## శ్రీశ్రీశ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ఖమ్మం జిల్లా, ఒడ్డు గ్రామం, శ్రీశ్రీశ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే నెలలో 21 నుండి 25 వరకు ఎంతో ఘనమైన ఏర్పాట్లతో వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ఖమ్మం, కొత్తగూడెం, కృష్ణా జిల్లాల నుండి అశేషమైన భక్తులు వచ్చి దర్శించుకున్నారు.



## అన్నమాచార్య జయంతి వేడుకలు

మే 23వ తేదీన చెన్నూరులోని స్థానిక శ్రీరాధాకృష్ణ మందిరంలో వికాస తరంగిణి, శ్రీనివాస భజన మండలివారు సంయుక్తంగా శ్రీఅన్నమాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి గాయకుడు కట్ల శ్రీనివాసాచార్యులు అన్నమయ్య గురించి చక్కగా తెలియ జేసారు. తదనంతరం అన్నమాచార్యుల సంకీర్తనలు శ్రీనివాస భజన మండలి భక్త బృందం వారు ఆలపించగా ఈ కార్యక్రమం వికాసతరంగిణి చెన్నూరు శాఖా అధ్యక్షులు భీమిని రవీందర్ గౌడ్, రాపర్తి. మనోహర్. సురేష్, పెండ్యాల సత్యనారాయణ, కార్తికేయ, అకినపెల్లి మహేశ్వర్, నాగేశ్వర్, రామచంద్రం, తంగల్లపెల్లి శేఖర్, అబ్బోజు సంజీవ్, కట్ల మహాలక్ష్మి శ్రీనివాసాచారి, దివిజేంద్రాచారి, వెంకట లక్ష్మీ, విశ్వకర్మ భజనమండలి వారు మహిళలు భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## శ్రీనమ్మాళ్వార్ల తిరునక్షత్ర మహోత్సవం


మే 23వ తేదీన రాష్ట్రపతి రోడ్డు, సికిందరాబాద్ శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో నమ్మాళ్వార్ల తిరునక్షత్ర మహోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు.





## దివ్య రథోత్సవం


పొన్నూరు (గుంటూరు జిల్లా) శ్రీసాక్షి భావనారాయణ స్వామి వారి దివ్య రథోత్సవం 23 మే 2024 నాడు కన్నుల పండుగగా జరిగింది

### జగిత్యాల జిల్లా గోధూరు గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో
## పున్నమ శ్రీసత్యనారాయణ వ్రతం



# నవాహ్నిక ఏకకుండాత్మక శ్రీరామాయణ హవనము



## శ్రీరామాయణ ప్రవచనములు







శ్రీరామాయణ మహాక్రతువు, ప్రవచనాలు ఎంతో వైభవంగా శ్రీ ఉ.వే శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్య స్వామి పర్యవేక్షణలో మల్కాపూర్ రోడ్‌లో పి.వి.ఆర్ ఫంక్షన్ హాల్, కరీణ్ణగరమ్ నందు తొమ్మిది రోజులపాటు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ పారాయణలు, పండితుల ప్రవచనాలు, పూర్ణాహుతి, ప్రసాద వితరణ ఘనంగా జరిగాయి.













# శ్రీసన్నిధానం సారస్వత ఆరాధన

మల్కాపూర్ రోడ్‌లో పి.వి.ఆర్ ఫంక్షన్ హాల్, కరీంనగరమ్ నందు శ్రీరామాయణ మహాక్రతువు కార్యక్రమములో మన శ్రీసన్నిధానం పత్రిక మరియు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సారస్వత ఆరాధనగా శ్రీ ఉ.వే శ్రీమాన్ కండ్లకుంట శ్రీనివాసాచార్యులు, శ్రీ ఉ.వే శ్రీమాన్ డా.ఒలేటి రవికుమారాచార్యులు, శ్రీ ఉ.వే శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్యులకు పండిత సమ్మానం చేయడం జరిగింది. శ్రీసన్నిధానం పత్రిక తరపున శ్రీమతి సముద్రాల శారదా గోపాలమూర్తి, శ్రీమాన్ డింగరి శ్రీనివాసమూర్తి, శ్రీమాన్ నమిలకొండ రఘురామాచార్యులు పాల్గొని పండిత సత్కారం చేయడం జరిగింది. ఈ సదవకాశం కల్పించిన శ్రీమాన్ తూపురాణి రంగాచార్య స్వామికి ధన్యవాదాలు తెలుపుతూ పత్రిక ఆవశ్యకతను, శ్రీసన్నిధానం కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలను శ్రీమతి సముద్రాల శారద తెలియజేసారు.



**శ్రీసన్నిధానం పత్రిక ఇక మీ ఇంటికి వస్తుంది. వెంటనే మీ పోస్టల్ అడ్రస్ ఈ క్రింది నంబరుకు పంపి మెంబర్ షిప్ తీసుకోండి. అత్యధిక పండితుల మంగళాశాసనాలతో అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఏకైక తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక శ్రీసన్నిధానం. మీరూ భాగస్వాములు కండి. మొబైల్ నంబర్ 95025 83323**

## కొలిచిన వారికి కొంగు బంగారం

# తాట్లవాయి శ్రీరాముడు

సేకరణ: సముద్రాల వేణుగోపాలచార్యులు




కొలిచిన వారికి కొంగు బంగారం తాట్లవాయి శ్రీరాముడు. అడవులు పర్వతములతో సహజమైన భౌగోళిక ప్రకృతి పరిసరాలతో ఏర్పడిన మారుమూల గ్రామం తాట్లవాయి. జిల్లాల విభజన కాకముందు కరీంనగర్ జిల్లాలో ఉండేది. ప్రస్తుతం జగిత్యాలలో కలదు మండల కేంద్రమైన రాయికల్ కు 12 కిలోమీటర్ల దూరంలో కలదు. ఈ తాట్లవాయి గ్రామం 1984 గ్రామపంచాయతీగా ఏర్పడినది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కెనాల్ పోచంపాడు ద్వారా చెరువులు కుంటలు నింపుకుంటారు. వేసంగిలో వ్యవసాయానికి కాలువల ద్వారా నీరు అందుట చేత పంటలు పండించుకుంటారు. ఈ గ్రామంలో గల చిన్న చిన్న కుంటలు చెరువులు వ్యవసాయానికి ఆధారంగా ఉన్నవి. ఈ గ్రామమును మునుపటి పరిస్థితులలో పోల్చి చూచినచో ఇప్పుడు అభివృద్ధి పథంలో ఉన్నదని చెప్పుటలో ఎంత మాత్రమూ సంశయం లేదు. అయినను ఇంకా ఎంతో అభివృద్ధి సాధించవలసి ఉన్నది. ఈ గ్రామానికి అనుబంధంగా ఆరు తాండాలు కలవు. ఈ గ్రామంలో ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కలవు. ఇట్టి తాట్లవాయి గ్రామములో స్వయం వ్యక్తముగా



శ్రీరామచంద్రస్వామి వెలసిన ప్రదేశము గుట్టమీద చిన్న గుహలో కలదు. ఇచ్చట శ్రీరామచంద్రుడు స్వయం వ్యక్తముగా వెలసియున్న వృత్తాంతమును శ్రీమాన్ శ్రీ చిలుకమర్రి వెంకట నరసింహాచార్యులు గారు (ఇక్కడి పూర్వ అర్చకులు) చక్కగా వివరించేవారు.

శ్రీమాన్ ఆత్తాన్ వెంకట వరదాచార్యులు గారు శిష్య సంచారం నిమిత్తంగా వచ్చి ఈ ప్రాంతంలో పర్యటించుచుండగా జరిగిన అపూర్వ సంఘటన. "ఆత్తాన్ వెంకట వరద దేశిక!" అని రెండుసార్లు పేరు పెట్టి పిలుచుట జరిగినదట! నా పేరు ఇక్కడి వారికి ఎట్లా తెలిసింది ఎవరు పిలిచినారని ఆ ప్రదేశమంతా తిరిగి చూసినారట! అక్కడ ఎవ్వరు కనిపించలేదట! రాత్రి నిదురించగా స్వప్నములో సాక్షాత్తుగా శ్రీరాముడే పిలిచినట్లుగా తెల్లని మల్లె పువ్వులు ఎక్కడ ఉంటాయో అదే నేను వెలసిన ప్రదేశమని స్వామి తెలియజేసినారట.

ప్రాతఃకాలమున నిద్ర నుండి మేల్కొని కాల కృత్యములు తీర్చుకొని స్నానానుష్ఠానములు భగవద్ ఆరాధన కార్యక్రమములను ముగించుకొని రాత్రి స్వప్నములో కనిపించిన ఆనవాళ్లను చూసుకుంటూ అతి కష్టముగా కొండమీదికి చేరుకోగా తెల్లని మల్లె పువ్వులు కనిపించినవట. పువ్వుల కింద రాముని

## కొలిచిన వారికి కొంగు బంగారం
# తాట్లవాయి శ్రీరాముడు

పాదుకలు శిలపై స్వయం వ్యక్తంగా నిలిచిన శ్రీసీతారాముల మూర్తులను సేవించుకున్నారట. ఆచార్యులవారు దుర్గ కొండమీద ఆ కాలంలో అతి కష్టముగా చేరుకొని శక్తి వంచన లేకుండా కొంతవరకు నిర్మాణ కార్యక్రమం చేపట్టి కొంతకాలము నివాసం చేసి వెళ్లిపోయినారట. ఇది సుమారు 300 సంవత్సరములకు పూర్వము జరిగిన వృత్తాంతం.

గుట్టపైన కనిపించు మహిమాన్వితమైన కొన్ని దృశ్యములు వాటి ఆనవాళ్లు: 1 రాముని దొనె, 2) లక్ష్మణుని దొనె, రాముని దొనెలో నీళ్లు ఉంటాయి లక్ష్మణుని దొనెలో కేవలం వర్షాకాలం మాత్రమే నీళ్లు ఉంటాయి ఉత్సవమూర్తులకు సంబంధించిన ఆలయము గ్రామంలో ఉంది. ప్రతి



సంవత్సరం ఈ ఆలయంలో బ్రహ్మోత్సవము చైత్ర శుద్ధ అష్టమి సాయంకాలం ప్రారంభమై చైత్ర బహుళ ప్రతిపదతో నవాహ్నిక పూర్వకముగా జరుగుచున్నది. బ్రహ్మోత్సవము లలో చూడవలసిన ప్రధాన ఘట్టాలు కళ్యాణోత్సవం రథోత్సవం దోపోత్సవం. ఈ వేడుకలను దర్శించడానికి దూరదూర ప్రాంతాల నుండి విశేషముగా భక్తజనులు ఏ ఏడుకు ఆ ఏడు అధికంగా రావడం విశేషం. భక్తజన సందోహం విశేషంగా రావడానికి కారణం స్వామి మహిమ అని చెప్పాల్సినదే! ప్రస్తుతము ఇప్పుడున్న నిర్మాణములు ఒకే కాలంలో జరగలేదు. ఆయా దాతలు యొక్క ఆర్థిక సహాయ సహకారములతో నిర్మించబడినవి.

పూర్వం స్వామివారి కల్యాణోత్సవం కొండపైన జరిగేది ఈ కళ్యాణ కార్యక్రమం భక్తుల కోసం అసౌకర్యంగా ఉండుటవలన శ్రీమాన్ శ్రీ చిలుకమర్రి వెంకట నరసింహాచార్యులు సుమారు 30 సంవత్సరముల క్రింద గుట్ట కిందకు మార్చినారు. అప్పటినుండి ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమము భక్తులంతా చూచుటకు అనుకూలమై నయనానందముగా ప్రతి సంవత్సరము జరుగుతున్నది. ఈ సంవత్సరం మార్చి 29వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు రామకోటి స్థూప ఆవిష్కరణ కళ్యాణ కార్యక్రమము వైభవంగా జరిగింది. తాట్లవాయి శ్రీరామచంద్ర స్వామి యొక్క మహిమలు వర్ణనాతీతము. ఉత్సవ సమయంలో భక్తులంతా గుట్టమీద గుండములోని నీళ్లను త్రాగెదరు. మరికొందరు పవిత్ర తీర్థముగా భావించి స్నానము చేసెదరు. వ్యవసాయదారులు ఈ గుండములోని తీర్థమును వారి వారి పంట పొలాల్లో క్రిమి నివారణకై చల్లుట ఆచారం ఇప్పటికీ కొనసాగుతున్నది. ఈ గుండములోని తీర్థమును పొలాలలో చల్లుట ద్వారా క్రిముల నాశనం జరుగుతుందని రైతుల దృఢవిశ్వాసం. వర్షాలు పడని సందర్భంలో శ్రావణమాసంలో వరద పాశం పోయుట ఇక్కడ భక్తజనుల ప్రజల యొక్క ఆచారం. వరద పాశం పోసిన వెంటనే వర్షం కురుస్తుందని చెబుతారు. ఇటువంటి మహిమగల ఈ క్షేత్రము ప్రజలు ప్రభుత్వము అభివృద్ధి చేయవలసిన అవసరం కలదు. రామాయణాన్ని పఠిస్తూ రామకోటి వ్రాస్తూ రాముని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరుతూ తాట్లవాయలో వెలసిన శ్రీ సీతారామచంద్రులను దర్శించి తరిద్దాము. ★



# బాలవిజ్ఞానం

# వింత కోరిక



త్రేతాయుగంలో శ్రీరామ, రావణ యుద్ధంనకు ముందు సముద్రానికి వంతెన నిర్మించారు. ఆ సమయంలో శ్రీరాముని అనుచరులైన వానరులు ప్రతీ రాతి మీద రామ అన్న పదాన్ని వ్రాసి, దానిని తీసుకెళ్ళి సముద్రంలో వేయసాగారు. అలా వేయగానే ఆ రాయి తేలి వంతెనకు అవసరమైన విధంగా సమకూరుతుండేది.

అక్కడే నిల్చుని ఇదంతా గమనిస్తున్న శ్రీరామునికో వింతకోరిక జనించింది. "ఆహా! వీరి భక్తి మహిమవల్లే కదా. ఈ రాళ్ళు సముద్రంలో మునిగిపోకుండా నీటిలో తేలుతున్నాయి. అని ఆ భక్తి గొప్పతనాన్ని అందరికి తెలియజేయాలనుకున్నాడు. తాను విసిరే రాతి మీద తన పేరు రాసుకోకుండా అందరూ చూసేలాగ ఓ రాయి తీసుకుని చుట్టు ప్రక్కలంతా కలియజూశాడు, దగ్గర్లో ఎవరైనా తన పనిని గమనిస్తున్నారేమోనని!

అప్పుడు శ్రీరాముడు చేతిలో వున్న రాతిని మెల్లగా నీటిలోకి విసిరాడు. దభేల్ మని శబ్దం రావడంతో దూరం నుండి వస్తున్న హనుమంతుడు రభీమని అక్కడ వాలాడు. శ్రీరాముని చర్యను చూసి "ప్రభూ! తమరి అనుచరుల మైన మేము ఇందరముండగా తమరు జలగర్భంలోకి రాళ్ళు వేయటమా!" అని దీనంగా పలికాడు.

శ్రీరాముడు అందుకు జవాబివ్వక తాను విసిరిన రాయివైపు తదేకంగా చూస్తున్నాడు. హన్మంతుడు కూడా తన ప్రభువు విసిరిన రాయి తేలుతుందేమోనని రాయివైపు చూడడం మొదలుపెట్టాడు. ఇలా కొన్ని గంటలు గడిచిపోయాయి. కానీ రాముడు విసిరిన రాయి తేలలేదు. అంటే అది నీటిలో పూర్తిగా మునిగిపోయింది. ఈ వింత సంఘటనకు ఆశ్చర్యచకితుడైన హన్మంతుడు "ప్రభూ! ఇదేమిటి అవతార పురుషులైన తమరు వేసిన రాయి నీటిలో మునిగిపోవడమా?" అని ప్రశ్నించాడు.

అప్పుడు శ్రీరాముడు వానరులందరి వైపు చూస్తూ భక్తుడైన హనుమంతుడిని ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఆంజనేయా! ఇందులో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. నేను నా పేరు, నా మహిమను చూపించడానికి వింత సంకల్పం చేశాను. మీరంతా భక్తి అనే పవిత్ర భావంతో నన్ను తలచుకొంటూ రాళ్ళను నీటిలో వేశారు. అందువలన మీకు గల భక్తి ప్రభావంతో, నమ్మకంతో ఆ రాళ్ళు పైకి తేలాయి. అందుకే భక్తి అనే మనోయజ్ఞంతో చేసే కార్యాలు సార్ధకమైనవి.

ఈ యుగధర్మం కూడా ఇదే. నేను చేసిన పని వికర్మతో కూడుకున్నది. సుకర్మతో భక్తితో చేసే పనులు నీటిలో తేలిన రాళ్ళలాగ పలువురికి కన్పిస్తాయి. అంతేకాక అవి ఒక ప్రయోజనాన్ని కూడా సాధిస్తాయి. కానీ అహం అనే వింత కోరికతో చేసే పనులు నీటిలో మునిగిపోయే రాళ్ళలాగ పదిమంది దృష్టిలో పడవు. అంతే కాక వాటివల్ల కలిగే ప్రయోజనం కూడా ఏమీ వుండదు" అని జవాబిచ్చాడు.

వెంటనే భక్తి పరవశుడైన హనుమంతుడు ఇలా అన్నాడు.

"మహాప్రభూ! ఎటువంటి వారికైనా వింత కోరికలు వుండకూడదు. యుగధర్మం పాటించాలి. అహంకారంతో ఏ పని చేయకూడదు. భగవంతునిపై భక్తి, విశ్వాసము కలిగి వుండాలి. ఈ దివ్యమైన తమ సందేశం చిరస్మరణీయమైనది. లోకానికి ఆదర్శవంతమైనది" అని భక్తి పూర్వకంగా ప్రణమిల్లుతూ శ్రీరామచంద్రస్వామి పాదాల మీద వాలిపోయాడు హనుమంతుడు.




★

PRAPATTI SRISANNIDHANAM Telugu Monthly JUN 2024 RNI NO : TELTEL12303

# శ్రీసన్నిధి పదకేళి 4

## ఆధారాలు నిలువు:

1. గురువులు నాలుగు నెలలు చేసే దీక్ష (4)
2. విశ్వరచన  చేయగల్గినవాడు (4)
3. ఆండాళ్ (గోదాదేవి) తండ్రి (5)
4. 'శ్రీపతి స్తుతి సుభాషితం' (శీర్షిక) చివరిమాట (4)
5. శ్రీరంగనాథుని భక్తుడు (6)




## ఆధారాలు అడ్డం:

5. ఓ నది పేరు (పరమపద యాత్రలో ఎదురైయ్యేనది) (5)
6. ఓం ప్రసన్నార్త్యై నమ: ఏ అష్టోత్తరం లోనిది (2)
7. బహుళ పక్షం (2)
8. ఫాల్గుణ పౌర్ణమి నాటి పండుగ (2)
9. నిద్రలో కూడా కన్నుమూయనిది (2)
10. చైత్రంతో ఐదవ దానికి ముందు మాసం (3)
11. విశ్వమంతటికి ఆధారమైన వాడు (5)
12. జనమేజయుడు ఏ యాగం చేశాడు 5)
13. సముద్రంపై వచ్చేది (2)

## పోటీలో పాల్గొనండి!

## ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు వాట్సప్ ద్వారా పంపించండి.
ఫలితాలతో ఆ నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు ప్రత్యక్షంగా
ఆ నెల పత్రిక ఉచితంగా మీకు అందిస్తాము.
సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.